

ఆబిడ్స్‌లో డాల్ఫిన్లు ఆకట్టుకుంటున్నాయి. నగరానికి అవి రావడమేంటని అనుకోకండి. నగర సుందరీకరణలో భాగంగా పోస్టాఫీసు ప్రధాన కార్యాలయం ఎదుట ఉన్న ఫౌంటెయిన్ నుంచి దూకుతున్నట్లు ఏర్పాటు చేసిన బొమ్మలివి.



# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శుక్రవారం 18 ఏప్రిల్ 2025 | సంపుటి:9 | సంచిక:112 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |


కాచిగూడ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏనుగు, జిరాఫీ బొమ్మలివి. వాటి లోపలి నుంచి ఏర్పాటు చేసిన బల్బులతో రాత్రివేళ వెలుగులు విరజిమ్ముతున్నాయి. మొక్కల మధ్యలో వాటిని ఉంచడంతో ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి.



## పాస్టర్లకు చంద్రబాబు గుడ్ న్యూస్.. నిధులు
# విడుదలకు గ్రీన్ సిగ్నల్



రాష్ట్రంలో పాస్టర్లకు సీఎం చంద్రబాబు గుడ్ న్యూస్ చెప్పారు. నెలకు రూ.5వేల చొప్పున గౌరవ వేతనం ఇచ్చేందుకు నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 8,427 మంది పాస్టర్లకు మే నెల నుండి నవంబర్ వరకు 7 నెలల కాలానికి కావాల్సిన రూ.30 కోట్లను విడుదల చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో యువగళం పాద్రయాత్ర సమయంలో పాస్టర్లకు గౌరవ వేతనం అందిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం నేడు నిధులను విడుదల చేసింది. ఇదిలా ఉంటే గతంలో జగన్ కూడా పాస్టర్లకు గౌరవవేతనం అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరవాత రెండేళ్ల వరకు అమలు చేయలేదు. రెండేళ్ల తరవాత కొన్ని కండిషన్స్ తో పాస్టర్లకు గౌరవ వేతనం అందించారు. అది కూడా కొద్దిమందికే ఇవ్వడంతో అప్పట్లో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు.

## భూమనకు పల్లా శ్రీనివాస్ సవాల్



తిరుపతి: తిరుమల గోశాల వద్దకు గురువారం వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి రావాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సవాల్ విసిరారు. ప్రతి సవాళ్లతో తిరుపతి లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పెద్ద ఎత్తున కార్యకర్తలు నేతలతో శాంతి ర్యాలీ నిర్వహించి కరుణాకర్ రెడ్డి చేస్తున్న అబద్దపు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కూటమి నేతలు పిలుపిచ్చారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు, వారి పీఏలు, గన్ మేన్‌లు మాత్రం గోశాల వద్దకు రావచ్చని, శాంతి భద్రతలకు విఘాతం కల్పించవద్దని ప్రభుత్వ అధికారులు కోరారు. దీంతో మంత్రులు, ...మిగతా 2లో

## గ్లోబల్ యంగ్ లీడర్‌గా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



ఢిల్లీ: వరల్డ్ ఎకనామిక్ ఫోరం గ్లోబల్ యంగ్ లీడర్ జాబితాలో తెదేపా ఎంపీ, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి స్థానం లభించింది. ప్రపంచవ్యాప్తంగా తమ రంగాల్లో ఉత్తమ నాయకత్వం కనబరిచిన యువ నాయకులను వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎంపిక చేస్తుంది. ఈసారి భారత్ నుంచి ఏడుగురు ఎంపికయ్యారు. దీనిపై రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ వరల్డ్ ఎకనామిక్ ఫోరం ద్వారా ' యంగ్ గ్లోబల్ లీడర్'గా ఎంపిక కావడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమైన, ప్రభావితమైన నిర్ణయాలు తీసుకునే స్థానంలో భారత యువత ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. నిజాయితీ, నూతన ఆలోచనలతో ప్రజలకు సేవ చేయాలని ఈ గుర్తింపు ...మిగతా 2లో



## ఏపీ విద్యార్థులకు శుభవార్త..రూ.300 కోట్లు కేటాయింపు !

తిరుపతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యార్థులకు అదిరిపోయే శుభవార్త చెప్పింది చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం. ఏపీలో హాస్టల్స్ నిర్మాణం, ప్రస్తుతం ఉన్న గురుకులాల మరమ్మత్తుల కోసం భారీగా ...మిగతా 2లో

## వైకాపా నాయకులు తిరుమల వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు



నెల్లూరు: తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అపవిత్రం చేసేందుకు వైకాపా నాయకులు కంకణం కట్టుకున్నారని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విమర్శించారు. నెల్లూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆనం.. వైకాపా నాయకుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. తితిదే పాలకవర్గాన్ని అవమానిస్తూ దూషించడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమలకు వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు సలహాలు, సూచనలు ఇవ్వడం మానేసి బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. తిరుమల వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

"తిరుమల బ్రహ్మోత్సవాల సమయంలో ఒక రకంగా.. ముక్కోటి ఏకాదశి సమయంలో మరో విధంగా, ...మిగతా 2లో

## మిథున్ రెడ్డి అభ్యర్థనను తిరస్కరించిన హైకోర్టు



అమరావతి, ఏప్రిల్ 17: వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసు విచారణలో ఆడియో, వీడియో రికార్డు చేసేలా ఆదేశాలు ఇవ్వాలన్న ఎంపీ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. అయితే మద్యం కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిని న్యాయవాదుల సమక్షంలో విచారించాలని సిట్‌కు ధర్మాసనం స్పష్టం చేసింది. న్యాయవాదులు విచారణకు ఆటంకం కలిగించవద్దని స్పష్టీకరించింది. విచారణ సందర్భంగా అధికారులు చేయి చేసుకొని, దుర్భాషలాడే ప్రమాదం ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో కార్యాలయంలో ఉన్న సీసీటీవీలో కనిపించేలా విచారణ జరపాలని అధికారులకు ...మిగతా 2లో

## పోక్సో కేసుల్లో 60శాతం మంది నిందితులు 18 ఏళ్లలోపు వాళ్లే

### హోంమంత్రి అనిత



విశాఖ: ప్రేమ అనే ముసుగులో యువత బలైపోతున్నారని.. ఆవేశంలో చేసిన తప్పులకు జైలుపాలు అవుతున్నారని ఏపీ హోంమంత్రి అనిత అన్నారు. విశాఖలో 'మహిళా రక్షణకు కలసికట్టుగా' అనే కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. పోక్సో ...మిగతా 2లో

## వైజాగ్ వైసీపీకి భారీ షాక్: జనసేనలోకి కార్పొరేటర్లు

విశాఖ: విశాఖ సిటీలో రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. వైసీపీకి విశాఖలో మరో షాక్ తగిలింది. ఊహించినట్లుగానే ఆ పార్టీ నుంచి కార్పొరేటర్లు ఒక్కరొక్కరుగా చేజారిపోతున్నారు. ఈ నెల 19న విశాఖ మేయర్? పై అవిశ్వాస తీర్మానం సందర్భంగా ... గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు వంశీరెడ్డి మంత్రి మనోహర్ సమక్షంలో జనసేనలో చేరారు. గోపాలపట్నం మండలం వైసీపీ నేత బెహరా భాస్కర్ భార్య, కోడలు కూడా వైసీపీ కార్పొరేటర్లుగా కొనసాగుతున్నారు. వీరుకూడా వంశీరెడ్డితో పాటు జనసేన కండువా కప్పుకున్నారు. దీంతో విశాఖ కార్పొరేషన్? లో కూటమి బలం మరింత పెరిగింది.



## దాల్మియా సిమెంట్స్ ఆస్తులను అటాచ్ చేసిన ఈడీ

హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల కేసులో దాల్మియా సిమెంట్స్ ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. రూ.793 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లు తెలిపింది. కడప జిల్లాలో 417 హెక్టార్ల సున్నపురాయి గనులను అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం దాల్మియా సిమెంట్స్‌కు లీజుకిచ్చింది. ఇందులో అక్రమాలు చోటు చేసుకున్నాయని సీబీఐ గతంలోనే ఆరోపించింది. జగన్‌తో కలిసి దాల్మియా సిమెంట్స్ అక్రమంగా సున్నపురాయి గనుల లీజులు పొందినట్లు సీబీఐ 2013లో ఛార్జిషీట్ దాఖలు చేసింది. తద్వారా జగన్ సుమారు రూ.150 కోట్ల మేర అక్రమంగా లబ్ధి పొందినట్లు అందులో పేర్కొంది. రఘురామ్ సిమెంట్స్‌లో రూ.95 కోట్ల విలువైన షేర్లు, రూ.55 కోట్లు హవాలా రూపంలో దాల్మియా సిమెంట్స్ ఇచ్చినట్లు అభియోగం మోపింది.



## 'టైమ్'లో లేని భారత్

### 'టైమ్' ప్రభావశీలుర జాబితాలో ట్రంప్, యూనస్.. భారతీయులకు దక్కని చోటు



న్యూయార్క్, ఏప్రిల్ 17: ఈ ఏడాది టైమ్ అత్యంత ప్రభావశీలుర జాబితాలో భారత్ నుంచి ఏ ఒక్కరికీ చోటు దక్కకపోవడం గమనార్హం. తాము ఎంచుకున్న మార్గంలో నలుగురికీ మార్గనిర్దేశనం చేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తుంటారు కొంతమంది వ్యక్తులు. ప్రపంచవ్యాప్తంగా అలాంటి ప్రభావశీలురను గుర్తించి జాబితా రూపొందిస్తుంది ప్రముఖ మ్యాగజైన్ 'టైమ్'. ఈ ఏడాది కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్ వంటి ప్రముఖులను ప్రభావవంతమైన వ్యక్తులుగా ప్రకటించింది. అయితే, ఈ సారి జాబితాలో భారత్కు చెందిన ఏ ఒక్కరికీ చోటు దక్కకపోవడం ఆశ్చర్యకరంగా మారింది.

2025 సంవత్సరానికి గానూ అత్యంత ప్రభావవంతమైన 100 మంది వ్యక్తుల జాబితాను టైమ్ తాజాగా వెల్లడించింది. లీడర్స్, ఐకాన్స్, టైటాన్స్, ఆర్టిస్ట్స్, ఇన్నోవేటర్స్ ఇలా పలు కేటగిరీలుగా విభజించి ...మిగతా 2లో

## వక్ఫ్ చట్టం చట్టబద్ధతపై విచారణ..

### వారం గడువు కోరిన కేంద్రం




ఢిల్లీ, ఏప్రిల్ 17: వక్ఫ్ (సవరణ) చట్టం-2025 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన 72 పిటిషన్లపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా వక్ఫ్‌పై సమాధానం ఇచ్చేందుకు కేంద్రం వారం గడువు కోరగా.. న్యాయస్థానం అందుకు అంగీకరించింది. తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని కేంద్రం తెలిపింది. అయితే, అప్పటివరకు వక్ఫ్ కౌన్సిల్లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించవద్దని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు మే 5కు వాయిదా వేసింది. ఇవే పిటిషన్లపై బుధవారం సుప్రీంకోర్టులో వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా వక్ఫ్‌పై న్యాయస్థానాలు ప్రకటించిన ఆస్తులను ప్రస్తుతానికి ...మిగతా 2లో

## రాష్ట్రపతికి గడువు

### స్పందించిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

ఢిల్లీ, ఏప్రిల్ 17: రాష్ట్రపతికి ఇటీవల సుప్రీం గడువు విధించిన నేపథ్యంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ స్పందించారు. శాసనసభలు ఆమోదించిన బిల్లులపై రాష్ట్రపతికి గడువు విధిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ స్పందించారు. న్యాయస్థానాలు రాష్ట్రపతికి ఆదేశాలు ఇచ్చే పరిస్థితి ఉండకూడదని వ్యాఖ్యానించారు.



శాసనసభలు ఒకటికి రెండు సార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఇటీవల సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. కేసు విచారణ సందర్భంగా కేంద్ర హోంశాఖ సూచించిన 3 నెలల వ్యవధిని.. పరిశీలన నిమిత్తం గవర్నర్లు పంపించిన రాష్ట్రాల బిల్లులపై రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవడానికి గడువుగా విధించడం సముచితమని భావించినట్లు ధర్మాసనం తెలిపింది.

## చైనాపై 245 శాతానికి సుంకాలు

### ముదురుతున్న వాణిజ్య వైరం



వాషింగ్టన్, ఏప్రిల్ 17: ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య యుద్ధం తారస్థాయికి చేరింది. చైనా ఎగుమతులపై ఏకంగా 245 శాతం సుంకాలను అమెరికా విధించింది. అమెరికాకు చెందిన బోయింగ్ కంపెనీ విమానాల ఆర్డర్లను తీసుకోవద్దని తమ కంపెనీలను చైనా ఆదేశించడంతోపాటు కీలకమైన ఖనిజాల ఎగుమతిని ...మిగతా 2లో

# భూమనకు పల్లా శ్రీనివాస్ సవాల్

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా ప్రతినిధులు గోశాల సందర్శన ప్రెస్ మీట్ కార్యక్రమాన్ని కూటమి నేతలు మార్చుకున్నారు. గత ప్రభుత్వంలా వ్యవహరించకుండా, ప్రజాస్వామ్య యుతం గానే పాలన అందించాలని అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఒకే సమయంలో అధికార, ప్రతిపక్షాలు గోశాల సందర్శనకు వద్దని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచించారు. ఎవరినీ గృహ నిర్బంధం చేయలేదని ఎస్పీ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించకుండా గోశాలను ఏ పార్టీ నేతలైనా సందర్శించవచ్చునని ఆయన అన్నారు.

**గుంపులుగా గోశాలకు రావద్దు..**

తిరుమల తిరుపతి దేవస్థానం గోశాలకు గుంపులుగా రావద్దని వైసీపీ నేతలకు తిరుపతి పోలీసుల సూచించారు. టీటీడీ గోశాలలో గోవుల మతికి సంబంధించి కూటమి ప్రజా ప్రతినిధులు.. తిరుపతి మాజీ ఎమ్మెల్యే సవాళ్లపై పోలీసు శాఖ గురువారం ఈ ప్రకటన విడుదల చేసింది. కార్యకర్తలతో కాకుండా గన్ మెన్‌లతో గోశాలను సందర్శించి, మీడియాతో మాట్లాడి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా వెళ్లిపోవాలని భూమన కరుణాకరరెడ్డికి పోలీసులు సూచించారు. శాంతి ర్యాలీ పేరుతో వందలాది కార్యకర్తలతో కాకుండా గన్ మెన్ లతో గోశాలను సందర్శించి మీడియాతో మాట్లాడవచ్చని కూటమి ఎమ్మెల్యేలు, నాయకులను పోలీసులు కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. కాగా టీటీడీ గోశాలల్లో మూగ జీవాల మతిపై రాజకీయ రగడ జరుగుతోంది. వైసీపీ , కూటమి నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. గోశాలలో ఘోరాలు జరుగుతున్నాయంటూ గొంతు చించుకున్న ఫ్యాన్ పార్టీ నేతలకు టీటీడీ స్ట్రాంగ్ కౌంటర్ ఇవ్వడంతో నోరు పెగలని పరిస్థితి. ఆవుల మతిని రాజకీయ లబ్ది కోసం వాడుకోవాలని ప్రయత్నించిన వైసీపీ చివరకు అబాసుపాలైంది. గత పాలక మండలి నిర్వాహకాలపై విజిలెన్స్ నివేదికలోని అంశాలను గత వైసీపీ ప్రభుత్వం తొక్కి పెట్టింది.

# గ్లోబల్ యంగ్ లీడర్‌గా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

(మొదటి పేజీ తరువాయి)

మరింత గుర్తు చేస్తుందని ఆయన అన్నారు.2014లో 26 ఏళ్ల అతి చిన్న వయసులో పార్లమెంట్ సభ్యుల్లో ఒకరిగా ఉన్న రామ్మోహన్ నాయుడు.. 2024 నుంచి ప్రధాని నరేంద్ర మోదీ మంత్రివర్గంలో క్యాబినెట్ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన నాయకత్వంలో పౌర విమానయాన శాఖ కొత్త పుంతలు తొక్కుతోంది. విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాల కల్పన నుంచి.. దేశంలోని వివిధ మారుమూల ప్రాంతాలకు వైమానిక సేవలను అభివృద్ధి చేసేందుకు ఆయన ఎంతో కషి చేస్తున్నారు.

**తెలుగువారికి గర్వకారణం: చంద్రబాబు**

యంగ్ గ్లోబల్ లీడర్‌గా ఎంపికైన రామ్మోహన్ నాయుడుకి సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు దేశానికి, ముఖ్యంగా తెలుగువారికి గర్వకారణమన్నారు. ప్రజాసేవలో రామ్మోహన్ అంకితభావం.. యువతకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందన్నారు. రామ్మోహన్ యంగ్ గ్లోబల్ లీడర్‌గా ఎంపిక కావడం ఏపీకి, భారత్‌కు గర్వకారణమని మంత్రి లోకేశ్ అన్నారు.

ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నుంచి ప్రేరణ పొందడం సంతోషంగా ఉందన్నారు. మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

# వైకాపా నాయకులు తిరుమల వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఒంటిమిట్టలో శ్రీకోదండరామస్వా మివారి కల్యాణం సందర్భంగా.. ఇలా ప్రతిసారీ ఏదో ఒక అంశాన్ని లేవనెత్తి అనవసర విమర్శలు చేస్తున్నారు. ఇప్పుడు గోశాలపై పడ్డారు. ఇదంతా చూస్తుంటే కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై నిందలు మోపడమే పనిగా పెట్టుకున్నారని అర్థమవుతోంది. బుధవారం సీపీఐ జాతీయ నాయకులు నారాయణ గోశాలకు వెళ్లారు. అక్కడ ఎలాంటి సమస్యలు లేవు, అంతా సజావుగా ఉందని చెప్పారు. వైకాపా నాయకులు మాత్రం సవాళ్లు చేస్తున్నారు.

గోశాలలో కొన్నిసార్లు గోశాలలో సహజ మరణాలుంటాయి. వాటిని కూడా పాలకమండలి, రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపేందుకు ప్రయత్నిస్తున్నారు. భూమన కరుణాకర్ రెడ్డి తితిదే ఛైర్మన్‌గా చేశారు. తితిదేను దోచేశారు. ఆలయం నిధులను సీసీ రోడ్ల పేరుతో దోచేశారు. దేవస్థానాన్ని అడ్డుగా పెట్టుకొని రూ. వందల కోట్లు దోచేశారు. కూటమి ప్రభుత్వాన్ని తప్పుపట్టే విధంగా అసత్య ప్రచారాలు చేస్తున్నారు. లేదంటే సవాళ్లు విసురుతున్నారు. కరుణాకర్ రెడ్డికి విజ్ఞత లేదు. మీ పునాదులు కదిలిపోయాయి. మీగురించి ఆలోచించే వారు లేరు. ఆచారాలు, తితిదే విధానాల పట్ల తప్పుడు ఆలోచనలు మంచిది కాదు'' అని ఆనం హెచ్చరించారు.

## ఏపీ విద్యార్థులకు శుభవార్త..రూ.300 కోట్లు కేటాయింపు !

(మొదటి పేజీ తరువాయి)

నిధులు కేటాయించింది చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం. ఈ మేరకు... ఏకంగా 300 కోట్లు కేటాయింపు చేసింది. ఈ విషయాన్ని ఏపీ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ప్రకటన చేశారు. ఇవాళ విశాఖ ద్వారకా నగర్ లో ఏపీ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పర్యటించారు. ఈ సందర్భంగా డిబివి, ఉచిత డీఎస్సీ శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు మంత్రి బాల వీరాంజనేయ స్వామి. అనంతరం అక్కడ ఉన్న నిరుద్యోగులకు ప్రభుత్వ మెటీరియల్స్ అందజేశారు. ఆ మెటీరియల్స్ ఉపయోగించుకొని మంచి ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు ఏపీ మంత్రి బాల వీరాంజనేయ స్వామి .

అలాగే ఏపీలో హాస్టల్ నిర్మాణం, గురుకులాల మరమ్మత్తుల కోసం 300 కోట్లు కేటాయించినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకుఎలాంటి సమస్యలు లేకుండా చూడడం జరుగుతోందని చెప్పారు. అన్ని రంగాల్లో చంద్రబాబు నాయుడు కూటమి సర్కార్ దూసుకు పోతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నామని చెప్పారు మంత్రి బాల వీరాంజనేయ స్వామి. వైసీపీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు చాలా కష్టాలు పడ్డారన్నారు.

# మిథున్ రెడ్డి అభ్యర్థనను తిరస్కరించిన హైకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

సూచిస్తూ.. విచారణ సందర్భంగా ఆడియో, వీడియో రికార్డు చేసేలా ఆదేశాలు ఇవ్వాలన్న పిటిషనర్ అభ్యర్థనను హైకోర్టు రిజెక్ట్ చేసింది. కాగా.. మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ఎంపీ మిథున్ రెడ్డిని రేపు (శుక్రవారం) ఉదయం విచారణకు హాజరుకావాలంటూ ఏపీ సిట్ బందం ఇటీవల నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. రేపు ఉదయం 10 గంటలకు విజయవాడ సీపీ కార్యాలయంలోని సిట్ కార్యాలయానికి విచారణకు రావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొంది. అయితే సిట్ నోటీసులపై తనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, అందువల్ల తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ మిథున్ రెడ్డి గతంలో హైకోర్టులో పిటిషన్ వేశారు.

ఈ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఎంపీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సుప్రీంలో ఎంపీకి ఊరట లభించింది. మిథున్ రెడ్డికి మధ్యంతర రక్షణ కల్పిస్తూ ఆదేశాలిచ్చింది ఉన్నతన్యాయస్థానం. మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయవద్దని ఆదేశాలు ఇస్తూనే విచారణకు సహకరించాలని ఎంపీకి సుప్రీం కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు రేపు విచారణకు రావాల్సిందిగా మిథున్ రెడ్డికి ఏపీ సిట్ బందం నోటీసులు జారీ చేసింది. న్యాయవాదుల సమక్షంలో విచారణ జరగాలని.. కానీ విచారణకు న్యాయవాదులు ఆటంకం కలిగించవద్దని తాజా ఉత్తర్వుల్లో ఏపీ హైకోర్టు తేల్చిచెప్పింది.

ఇక ఈ కేసులో సిట్ అధికారులు దర్యాప్తు చేయగా.. కీలక సమాచారాలను సేకరించారు. అందులో భాగంగా ఈ వ్యవహారం మొత్తం కసిరెడ్డి రాజశేఖర్ కనుసన్నుల్లోనే నడిచిందని తేలింది. దీంతో కసిరెడ్డిని విచారించేందకు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు సార్లు సిట్ నోటీసులు పంపించింది. కానీ కసిరెడ్డి మాత్రం విచారణకు డుమ్మా కొట్టారు. కసిరెడ్డి ఫోన్లు కూడా స్విచ్‌ఆఫ్ రావడంతో కుటుంబసభ్యులకు నోటీసులు జారీ చేశారు సిట్ అధికారులు. అలాగే ఈ కేసులో సాక్షిగా విచారణకు రావాల్సిందిగా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి కూడా సిట్ నోటీసులు పంపించింది. దీంతో రేపు ఎంపీ మిథున్ రెడ్డి, విజయసాయిరెడ్డిలను సిట్ అధికారులు విచారించనున్నారు. వీరి విచారణతో మద్యం కుంభకోణానికి సంబంధించి ఇంకెన్ని విషయాలు బయటకు వస్తాయో చూడాలి మరి.

# అవిశ్రాంతంగా శ్రమించినం

- **సహాయక చర్యలు కష్టతరంగా మారినయ్**
- **ఎస్ఎల్‌బీసీ ప్రమాదం ఘటనపై ఫైనల్ రిపోర్ట్ సిద్ధం..**
- **నేడో రేపో.. టన్నెల్ ప్రమాదంపై కీలక ప్రకటన చేయనున్న ప్రభుత్వం...?**

**హైదరాబాద్,** మనం ప్రతినిధిః నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో సుమారు రెండు నెలల క్రితం జరిగిన ఘోర ప్రమాదానికి సంబంధించిన సహాయక చర్యలు తుది దశకు చేరుకున్నాయి. సొరంగం పైకప్పు కూలిన ఘటనలో గల్లంతైన ఆరుగురు కార్మికుల ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. రానున్న మూడు, నాలుగు రోజుల్లో మిగిలిన శిథిలాల తొలగింపు పూర్తయ్యాక కూడా వారి జాడ తెలియకపోతే, వారిని చట్టప్రకారం మరణించినట్లుగా ప్రకటించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఫిబ్రవరి 22న జరిగిన ఈ దుర్ఘటనలో మొత్తం ఎనిమిది మంది కార్మికులు గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరి మృతదేహాలను సహాయక బృందాలు ఇప్పటికే వెలికితీశాయి. అప్పటి నుంచి, గల్లంతైన మిగిలిన ఆరుగురి కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సింగరేణి, రైల్వే, హైడ్రా వంటి 11 సంస్థల బృందాలు గత రెండు నెలలుగా అవిశ్రాంతంగా శ్రమిస్తున్నాయి. ఇక అక్కడ ఎలాంటి ఆపరేషన్ చేయడం సాధ్యం కాదు. ఆ ప్రాంతంలో యంత్రాలతో పనులు చేపడితే సహాయక సిబ్బందికే ముప్పు వాటిల్లుతుందని నిపుణులు హెచ్చరించారు.. అని ఎస్ఎల్‌బీసీ ప్రత్యేక అధికారి లోతేటి శివశంకర్ మీడియాకు వివరించారు. ఇదిలా ఉండగా, క్లిష్టమైన చివరి 50 మీటర్ల భాగంలో (క్రిటికల్ జోన్) సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించి, మృతదేహాలను వెలికితీసే మార్గాలను అన్వేషించేందుకు తెలంగాణ ప్రభుత్వం 11 మంది సభ్యులతో కూడిన ఒక సాంకేతిక నిపుణుల కమిటీని నియమిస్తూ జీవో జారీ చేసింది. ఒకవేళ అన్ని ప్రయత్నాలు విఫలమై, కార్మికుల ఆచూకీ లభించని పక్షంలో, చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసి, వారిని 'మరణించినట్లుగా భావించి' ప్రకటించడమే ప్రభుత్వానికి మిగిలిన మార్గమని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

# వక్ఫ్ చట్టం చట్టబద్ధతపై విచారణ..

(మొదటి పేజీ తరువాయి)

వక్ఫ్ జాబితా నుంచి తొలగించకూడదని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ప్రతిపాదించింది. వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ మండలిలో.. ఎక్స్-అఫీషియో సభ్యులు మినహా మిగతా సభ్యులంతా కచ్చితంగా ముస్లింలే అయ్యుండాలనీ సూచించింది. మతంతో సంబంధం లేకుండా ఎక్స్-అఫీషియో సభ్యులను నియమించొచ్చని పేర్కొంది. ఈ మేరకు వక్ఫ్(సవరణ) చట్టంలోని కొన్ని కీలక నిబంధనలపై స్టే విధించేందుకు ప్రతిపాదనలు చేసింది.



# పాఠశాల వంట పాత్రల్లో విషం

**హైదరాబాద్,** మనం ప్రతినిధిః కుటుంబ సభ్యులు తనను నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆక్రోశంతో ఓ యువకుడు దారుణానికి ఒడిగట్టాడు. ఏకంగా పాఠశాల విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడేందుకు ప్రయత్నించాడు. మధ్యాహ్న భోజనం వండే పాత్రలపై పురుగుల మందు చల్లాడు. ఈ దారుణ ఘటన ఆదిలాబాద్ జిల్లా ఇచోడ మండలం ధర్మపురి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకుంది. అప్రమత్తమైన ప్రిన్సిపాల్ ఫిర్యాదుతో విషయం వెలుగులోకి రాగా, పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ధర్మపురి గ్రామానికి చెందిన సోయం కిస్టు (27) అనే గిరిజన యువకుడు నిరుద్యోగి... కుటుంబ సభ్యులు తనను పట్టించుకోవడం లేదని, ఏ పనిలోనూ తనకు సహకరించడం లేదని కొంతకాలంగా అతను అసంతృప్తితో ఉన్నాడు. ఈ క్రమంలో వారి దృష్టిని ఆకర్షించేందుకు ఏదైనా సంచలనాత్మకమైన పని చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగానే ఓ పాఠశాల వంటగదిలోకి చొరబడ్డాడు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రతిభ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం వంటగది తలుపు గడియ విరిగి ఉండటం, గదిలో ఘాటైన వాసన రావడాన్ని ఆమె గమనించారు. లోపలికి వెళ్లి చూడగా, మధ్యాహ్న భోజనం వండేందుకు సిద్ధంగా ఉంచిన పాత్రలపై ఏదో రసాయనం చల్లి ఉంది. పక్కనే బకెట్లో ఉన్న నీటిలో కూడా రసాయనం కలిపి ఉంది. దీంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పర్యవేక్షణలో పాఠశాల ప్రాంగణాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, ఖాళీ పురుగుల మందు డబ్బా లభ్యమైంది. 'మా బృందం ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారిలో ఒకడైన సోయం కిస్టు నేరం అంగీకరించాడు. అతను పాఠశాల సమీపంలోనే నివసించే నిరుద్యోగ కూలీ... అతన్ని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించాం' అని ఎస్పీ తెలిపారు. తన కుటుంబ సభ్యులు తనను పట్టించుకోకపోవడంతో ఈ పని చేసినట్లు తెలిపాడు. 'తన సోదరుడు పత్తి చేను కోసం తెచ్చిన పురుగుల మందునే ఇందుకు ఉపయోగించినట్లు కిస్టు చెప్పాడు. ప్రిన్సిపాల్ ప్రతిభ ఫిర్యాదు మేరకు పోలీసులు భారతీయ న్యాయ సంహిత.. సెక్షన్లు 329(4), 324(6), 331(8), 332 లతో పాటు ఊఖిఖిఅ చట్టంలోని సెక్షన్ 56 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోక్సో కేసుల్లో 60శాతం మంది నిందితులు

# 18 ఏళ్లలోపు వాళ్లే

(మొదటి పేజీ తరువాయి)

కేసుల్లో 20 శాతం మంది నిందితులు 20 ఏళ్ల లోపు వాళ్లే ఉంటున్నారన్నారు. 18 ఏళ్లలోపు వాళ్లు 60 శాతం మంది ఉంటున్నారని చెప్పారు. అన్ని విద్యాలయాల్లో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వీయ క్రమశిక్షణ ఒక సబ్జెక్ట్‌గా పాఠాల్లో చేర్చుతామని మంత్రి వివరించారు. ''రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో 'మహిళా రక్షణకు కలసికట్టుగా' కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. వంద సంవత్సరాల జీవితం కోసం యువత ఆలోచన చేయాలి. స్వీయ నియంత్రణ అందరూ అలవాటు చేసుకోవాలి. మన కోసం నిరంతరం కష్టపడుతున్న తల్లిదండ్రుల కోసం ఒక్క క్షణం ఆలోచించాలి. యువత భవిష్యత్తును గంజాయి నాశనం చేస్తుంది. యువత.. జీవితాలను ఇబ్బందుల పాలు చేసుకోవద్దు'' అని అనిత సూచించారు.

# చైనాపై 245 శాతానికి సుంకాలు

(మొదటి పేజీ తరువాయి)

నిలిపేయడమే దీనికి కారణమని తెలుస్తోంది. 'అత్యంత కీలకమైన, అరుదైన ఖనిజాల ఎగుమతిని చైనా నిలిపేయడంవల్ల జాతీయ భద్రతకు ఎదురయ్యే సవాళ్లపై పరిశోధన జరపడానికి ఉద్దేశించిన కార్యనిర్వాహక ఉత్తర్వుపై అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ సంతకం చేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలి రోజు నుంచే 'అమెరికా ఫస్ట్ ట్రేడ్ పాలసీ'కి అనుగుణంగా 'మేక్ అమెరికా ఎకానమీ గ్రేట్ ఎగైన్' కోసం ఆయన పని చేస్తున్నారు. 75కు పైగా దేశాలు కొత్త వాణిజ్య ఒప్పందాల కోసం ఇప్పటికే మమ్మల్ని సంప్రదించాయి. అందుకే సుంకాలను ప్రస్తుతానికి నిలిపేశాం. ఒక్క చైనాపై తప్ప' అని మంగళవారం శ్వేతసౌధం విడుదల చేసిన వాస్తవ పత్రం వెల్లడించింది. అమెరికాకు ఎగుమతి చేసే ఉత్పత్తులపై చైనా ప్రస్తుతం 245 శాతం సుంకాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆ పత్రం వివరించింది. గతంలో అమెరికా ఉత్పత్తులపై 84 శాతం సుంకాలను విధించిన చైనా.. శుక్రవారం వాటిని 125 శాతానికి పెంచింది.




# మద్యానికి రెక్కలు

## పెరగనున్న లిక్కర్ ధరలు!

## ఇప్పటికే బీర్ల ధరలను పెంచిన ప్రభుత్వం

## ఫుల్ బాటిల్‌పై కనీసం రూ. 50 పెంపు

**హైదరాబాద్,** మనం ప్రతినిధిః తెలంగాణలో మందుబాబులు మరో చేదు వార్త వినక తప్పదు మరి. ఇది వారికి బ్యాడ్ న్యూస్ అనే చెప్పాలి. ఇప్పటికే బీర్ల ధరలను రేవంత్ ప్రభుత్వం పెంచింది. ఇప్పుడు లిక్కర్ వంతు వచ్చింది. మందు బాటిళ్ల ధరలను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు అధికార వర్గాల ద్వారా సమాచారం. చీప్ లిక్కర్ మినహా అన్ని రకాల లిక్కర్ బాటిళ్లపై కనీసం 10 శాతం ధరలను ప్రభుత్వం పెంచబోతున్నది. ఇదే జరిగితే ఫుల్ బాటిల్ ధర ప్రస్తుత ధరను బట్టి కనీసం రూ. 50 వరకు పెరగనుంది. బాటిల్ ధర రూ. 500 కంటే ఎక్కువ ఉన్న మద్యం రేట్లన్నీ పెరుగనున్నాయి.

# భూ భారతితో అక్రమార్కుల భరతం పడతాం

## ధరణితో బీఆర్ఎస్ నేతలు దోచిన భూములను పేదలకు పంచుతాం

## రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,** మనం బ్యూరోః భూ సమస్యలు శాశ్వ తంగా తీర్చాలన్న లక్ష్యంగా రాష్ట్రంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్ల డించారు. ఈ చట్టంతో పేదల భూములను లాక్కున్న అక్రమార్కుల భరతం పడతామని స్పష్టం చేశారు. గురువారం నారాయ ణపేట జిల్లా మద్దూరు మండలం ఖాజీపూర్‌లో భూ భారతి చట్టంపై ఏర్పాటు చేసిన తొలి రెవెన్యూ సద స్సును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణిలో తమ భూమి నమోదు కాలే దని బీఆర్ఎస్ నేతలే చెబుతున్నా రని పేర్కొన్నారు. ధరణి లోపాలను సరిదిద్దాలని మాజీ మంత్రులు కోరుతున్నారు. వివరాలు తప్పుగా నమోద య్యాయని చెబుతున్నారు. ఈ బిల్లును అసెంబ్లీలో పెడితే మాత్రం అడ్డుకునే ప్రయత్నం చేశారని విమ ర్శించారు. పేదలకు అండగా ఉండేందుకే ఈ చట్టం తీసుకొచ్చాం. భూ భారతి చట్టం దేశంలోనే రోల్ మోడల్ కాబోతోంది. ధరణి అమలులో ఉన్నప్పుడు అధికారుల వద్దకే ప్రజలు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రజల వద్దకే అధికారులు వస్తున్నారని పేర్కొన్నారు. ఒక్క రూపాయి కూడా లేకుండా దరఖాస్తు చేసే అవ



కాశం వచ్చింది. పేదలకు చెందిన వేల ఎకరాలను గత ప్రభుత్వం కొల్లగొట్టింది. గతంలో కొల్లగొట్టిన భూములపై ఆడిట్ చేసి పేదలకు పంచుతామని మంత్రి స్పష్టం చేశారు. అసైన్డ్ భూముల్లో సాగు చేసుకుంటున్న అర్హులైన పేదలకు బీఆర్ఎస్ నేతలు కొట్టేసిన భూము లను పంచుతామనీ, కోర్టులో లేని భూముల సమస్యలను భూ భారతి ద్వారా శాశ్వతంగా పరిష్కరిస్తామని చెప్పారు. గతంలో పాసు పుస్తకం ప్రకారం కాకుండా భూమి ఎక్కువో లేదా తక్కువో ఉండేదనీ, ఇప్పుడా పరిస్థితి ఉండదని ఈ సంద ర్భంగా మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# 'టైమ్'లో లేని భారత్

(మొదటి పేజీ తరువాయి)



ఈ వార్షిక జాబితాను రూపొందించింది. లీడర్ల కేటగిరీలో అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, డోజ్ అధినేత ఎలాన్ మస్క్, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తదితరులు ఉన్నారు.

సాధారణంగా ఏటా టైమ్ ప్రకటించే ప్రభావశీలుర జాబితాలో భారతీయులకు స్థానం ఉండేది. గతేడాది బాలీవుడ్ నటి అలియా భట్, ఒలింపిక్ పతక విజేత, రెజ్లర్ సాక్షి మలిక్కు చోటు దక్కింది. అంతకుముందు 2023లో ప్రముఖ తెలుగు దర్శకుడు రాజమౌళి, బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ వంటివారు ప్రభావవంతమైన వ్యక్తులు నిలిచారు. ఈసారి జాబితాలో భారత్ నుంచి ఏ ఒక్కరికీ చోటు దక్కకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

**భారతసంతతి నాయకురాలికి చోటు..**

అయితే, భారత సంతతికి చెందిన రేష్మ కెవల్రామణి టైమ్ జాబితాలో ఉన్నారు. ఈమె వర్టెక్స్ ఫార్మా సీఈఓగా వ్యవహరిస్తున్నారు. 11 ఏళ్ల వయసులోనే రేష్మ కుటుంబం అమెరికాకు వలస వెళ్లి అక్కడే స్థిరపడింది. ఫార్మా రంగంలో రాణించిన రేష్మ.. అమెరికా అతిపెద్ద బయోటెక్నాలజీకి తొలి మహిళా సీఈఓగా అరుదైన ఘనత అందుకున్నారు.

# వక్ఫ్ ఆదాయం పేద ముస్లింలకు....

**హైదరాబాద్,**మనం బ్యూరోః వక్ఫ్ బోర్డు ద్వారా వచ్చే ఆదాయంలో లాభాన్ని పేద ముస్లింలకు పంచుతామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి తెలి పారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఆస్తులన్నింటినీ డిజిటలైజేషన్ చేస్తుందని వెల్ల డించారు. గురువారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాల యంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ వ క్ఫ్ బోర్డుకు సంబంధించి



దేశవ్యాప్తంగా ఉన్న రూ.వేల కోట్ల ఆస్తులు ఎన్నో ఏళ్లుగా ఆక్రమణలకు గురయ్యాయని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా లక్షల ఎకరాల భూమి కబ్జాకు గురైందన్న విషయాన్ని ముస్లిం సమాజం గుర్తించాలని సూచించారు. వక్ఫ్ బోర్డుపై జిల్లాల్లో నిర్వహించే సమా వేశాలకు అన్ని వర్గాల వారిని ఆహ్వానించాలని పార్టీ నేతలను కోరారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణలోని అంశా లపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముస్లిం సామాజిక వర్గంలోని కొందరు నేతలు తమ రాజకీయ స్వార్థంకోసం వక్ఫ్ బోర్డు చట్ట సవరణపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారనీ, ఇన్నాళ్లు పేద ముస్లింలకు అవాస్తవాలను ప్రచారం చేసి బీజేపీపై, కేంద్ర ప్రభుత్వంపై ఉసిగొల్పుతున్నారని విమ ర్శించారు. ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా ముస్లిం నేతలు వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని సమర్థించాలని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# టిటిడి సేవలను అభినందించిన ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ

**తిరుపతి, ఏప్రిల్17 మనం న్యూస్ :** శ్రీవారి భక్తులకు టిటిడి అందిస్తున్న సేవలపై ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ సంతృప్తిని వ్యక్తం చేసింది. గతంలో భక్తులకు అందిస్తున్న సేవలకు, ప్రస్తుతం అందిస్తున్న సేవలలో చాలా మార్పు కనిపిస్తోందని ఏపీ శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మెన్ శ్రీ వేగుల్ల జోగేశ్వర రావు వెల్లడించారు. శ్రీవారి భక్తుల సేవ నిరంతరం సేవ అని, శ్రీవారి భక్తులకు మరింత నాణ్యంగా అందిస్తూ శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని సూచించారు. తిరుపతిలోని శ్రీ పద్మావతీ అతిథి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యులు, అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ ఛైర్మెన్ వేగుల్ల జోగేశ్వర రావు మాట్లాడుతూ, అంచనాల కమిటీ చేసిన పలు సూచనలను పరిగణలోకి తీసుకుని మరింత నాణ్యంగా సేవలు అందించాలని సూచించారు.వైద్య సేవలపై అభినందనలు : ఇటీవల తాను శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చానని, అనుకోకుండా అనారోగ్యానికి గురై తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో చేరగా వైద్య సేవలు చాలా నాణ్యతగా, సేవాతత్వంతో అందించారని ఏపీ అంచనాల కమిటీ సభ్యులు శ్రీ పెన్మత్స వరాహ వెంకట సూర్యనారాయణ రాజు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అశ్విని ఆసుపత్రి సిబ్బందిని ఆయన అభినందించారు.టిటిడిలో అమలవు తున్న సేవలపై సభ్యులు సంతోషం వ్యక్తం చేయగా, పరిశుభ్రత, పారిశుధ్యం - తిరుమలలో పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, భక్తులు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సేవలు అందుతున్నాయన్నారు. వసతి గదుల నిర్వహణపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని సభ్యులు సూచించారు.



నవతరానికి శ్రీవారి వైభవాన్ని తెలియజేసేలా డిజిటల్ మీడియాను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

శ్రీవారి సేవ - సీఎం నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు శ్రీవారి సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని టిటిడి ఈవో వెల్లడించారు. వివిధ విభాగాలలో నైపుణ్యం, నిపుణుల సేవలను అన్ని విభాగాలలో అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఈవో తెలిపారు. అదే విధంగా తిరుమలలో క్రమం తప్పకుండా టిటిడి సేవలపై ప్రకటనలు ఇవ్వాలని, టిటిడి వసతి గృహాలలో అన్ని చోట్ల శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీపద్మావతి అమ్మవారి చిత్ర పటాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వామివారి కీర్తనలు, గోవింద నామావళిని రాత్రి 10 గం.ల వరకు వినిపించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరగా, టిటిడి ఈవో సమాధానం ఇస్తూ, ఇప్పటికే ప్రత్యేక చర్యలు చేపట్టామని, మరింత పటిష్టంగా అమలు చేస్తామని ఈవో చెప్పారు. తిరుమలలో వసతి గదుల నిర్మాణాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఈవో సమాధానం ఇస్తూ, కాలం చెల్లిన భవనాల స్థానంలో కొత్త భవనాలు, మరమ్మత్తులు మినహా హైకోర్టు నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపట్టలేదని వివరించారు. వసతి గదుల నిర్వహణపై నిత్యం పర్యవేక్షణ చేస్తున్నామని ఈవో తెలిపారు. కాషన్ డిపాజిట్ ను భక్తులకు సకాలంలో చెల్లించేందుకు మరింత పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. ఒకరి పేరుతో వసతి గది తీసుకుని మరొకరు వచ్చి ఫేస్ రికగ్నిషన్ కోసం రావడం వల్ల చెల్లింపులో ఆలస్యం కావడం మినహా, కాషన్ డిపాజిట్ ను సంబంధిత వ్యక్తులకు సకాలంలో చెల్లింపు చేస్తున్నామన్నారు.

వైకుంఠం -1, 2 లలో భక్తులకు అందిస్తున్న అత్యవసర వైద్య సేవలపై సభ్యులు అడిగి తెలుసుకున్నారు. శ్రీవాణి ట్రస్ట్ పై సభ్యులు అడిగిన సమాచారాన్ని సభ్యులకు ఈవో తెలియజేశారు. టిటిడి ఆధ్వర్యంలో చేస్తున్న స్వామివారి, అమ్మవారి రాతి విగ్రహాల తయారీ, పంపిణీ వివరాలను సభ్యులు అడగగా, ఈవో మాట్లాడుతూ, హిందూ ఆలయాలకు 5 అడుగుల లోపు స్వామివారు, అమ్మవారి విగ్రహాలను ఉచితంగా అందిస్తామని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారుల ప్రాంతాలలో ఉచితంగా సప్లయ్ చేస్తామని ఈవో చెప్పారు.

తిరుమలలో భక్తులకు అందిస్తున్న సేవలపై శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా టిటిడి అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి ఏపీ అంచనాల కమిటీ సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంచనాల కమిటీ సభ్యులు భూమా అఖిలప్రియ, నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, డా. వాల్మీకి పార్థసారథి, పాశిం సునీల్ కుమార్, ఏలూరు సాంబశివరావు, వరుదు కళ్యాణి, పెన్మత్స వరాహ వెంకటసూర్య నారాయణ రాజు, టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ తదితర అదికారులు పాల్గొన్నారు.

# శ్రీసిటీ డైకిన్ ప్లాంట్ ను సందర్శించిన డైకిన్ ఇండస్ట్రీస్ గ్లోబల్ ప్రెసిడెంట్

- **శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ పట్ల ప్రశంస**



**శ్రీసిటీ, ఏప్రిల్ 17, మనం న్యూస్ :** డైకిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నౌపుమీ టకేనాక గురువారం శ్రీసిటీలోని డైకిన్ ఇండియా తయారీ కేంద్రాన్ని సందర్శించారు. డైకిన్ ఇండియా ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.జె.జావా ఆయనకు ఆహ్వానం పలికారు. ప్లాంట్ పనితీరుపై సమీక్ష జరిపిన టకేనాక, ప్లాంట్ నిర్వహణ, సాంకేతిక నైపుణ్యం, దీర్ఘకాలిక విస్తరణ ప్రణాళిక తదితర అంశాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

పర్యటనలో భాగంగా టకేనాక, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కొద్దిసేపు సమావేశమయ్యారు. గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్గా శ్రీసిటీ ఎదుగుదలను రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా టకేనాకకు వివరించారు. ముఖ్యంగా ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, సుస్థిరత ద్వారా ఈ ప్రాంతం యొక్క పారిశ్రామిక వృద్ధికి డైకిన్ అందించిన గణనీయమైన సహకారాన్ని ఆయన ప్రశంసించారు.

శ్రీసిటీ పెట్టుబడిదారుల అనుకూల పర్యావరణ వ్యవస్థను ప్రశంసించిన టకేనాక, పారిశ్రామికవాడ స్థాయి, సామర్థ్యం, ఆధునిక మౌలిక సదుపాయాలను కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు శ్రీసిటీ బృందం అందిస్తున్న సహాయ సహకారాల పట్ల స్పందించిన ఆయన, శ్రీసిటీలో మరింత విస్తరించడానికి డైకిన్ ప్రణాళికలను కలిగివుందని చెప్పాడు. .

పర్యటన పట్ల టకేనాకకు కృతజ్ఞతలు తెలిపిన డా. సన్నారెడ్డి, అఇ కంప్రెషర్లను ఉత్పత్తి చేయడానికి తైవాన్కు చెందిన రెచీ సంస్థ భాగస్వామ్యంతో డైకిన్ ఏర్పాటు చేస్తున్న నూతన తయారీ కేంద్రం, దేశంలో ఏసీ తయారీ హబ్ గా ఎదగాలన్న శ్రీసిటీ లక్ష్యానికి మరింత బలాన్ని చేకూరుస్తోందన్నారు. మంచి పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను పెంపొందించాలన్న శ్రీసిటీ దృష్టికి సరితూగేలా సాంకేతిక, స్థానిక అభివృద్ధి ప్రాధాన్యతతో డైకిన్ పయనిస్తోందని వ్యాఖ్యానించారు.

# అమెరికాలో రాష్ట్ర మంత్రిగా చంద్రగిరి వాసి

- **58 శాతానికి పైగా ఓట్లతో ఆల్డర్(యంయల్ఏ) విజయం**

**చంద్రగిరి ఏప్రిల్ 17 మనం న్యూస్ :** చంద్రగిరిలోని టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షులు లంకెళ్ళ లలిత ,శ్రీరాముల కుమారుడు లంకెళ్ళ బద్రి అమెరికాలోని విస్కాన్ సిన్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికలలో మాడిసన్ డిస్ట్రిక్ట్ -7 నందు ఆల్డర్ (యంయల్ఏ)గా 58 శాతానికి పైగా ఓట్లతో విజయం సాధించారు.మంగళవారం రాత్రి ఇస్కాన్సిన్ రాష్ట్ర పబ్లిక్ వరక్స్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 25 సంవత్సరాలుగా అమెరికాలో ఉంటూ అక్కడే రాజకీయాలలో చురుకైన పాత్ర




పోషిస్తూ వున్నారు.మాడిసన్ డిస్ట్రిక్ట్ స్థిరత్వ కమిటీలోను,మాడిసన్ మెట్రోపాలిటీన్ సేవేజ్ డిస్ట్రిక్ట్ కమిషనర్ గా స్థానం పొందారు. ఇంతటి గొప్ప స్థానాన్ని పొందిన బద్రి తల్లిదండ్రులు మాట్లాడుతూ అమెరికాలో ఘనవిజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.అమెరికా భారత దేశాల మధ్య మెరుగైన సంబంధాల కోసం తమ కుమారుడు శక్తివంతం లేకుండా కృషి చేయగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.చంద్రగిరిలో పుట్టి పెరిగి ఉన్నత దేశమైన అమెరికాలో గొప్ప విజయం సాధించి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయటం తమకంతా ఎంతో గర్వకారణగా ఉందని స్థానికులు అన్నారు

# శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల జూలై నెల కోటా విడుదల

**తిరుపతి, ఏప్రిల్ 17 మనం న్యూస్ :** తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల జూలై నెల



కోటాను ఏప్రిల్ 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది.

ఈ సేవా టికెట్ల లక్కీ డిప్ రిజిస్ట్రేషన్ కోసం ఏప్రిల్ 19 ఉదయం 10 గంటల నుండి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చు.

లక్కీ డిప్ ద్వారా ఈ టికెట్లు పొందిన భక్తులు ఏప్రిల్ 21 నుండి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే వారికి టికెట్లు మంజూరవుతాయి.

22న ఆర్జిత సేవా టికెట్ల విడుదల

కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల జూలై నెల కోటాను 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు.

22న వర్చువల్ సేవల కోటా విడుదల

వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన జూలై నెల కోటాను 22న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది.

23న అంగప్రదక్షిణం టోకెన్లు.

జూలై నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది.

23న శ్రీవాణి టికెట్ల ఆన్ లైన్ కోటా

శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన జూన్ నెల ఆన్ లైన్ కోటాను 23వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది.

వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా

వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా జూలై నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది.

24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

జూలై నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది.

# స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశమైన 16వ ఆర్థిక సంఘం



**తిరుపతి, ఏప్రిల్17 మనం న్యూస్ :** తిరుపతి కలెక్టరేట్ సమావేశ మందిరం నందు గ్రామీణ ప్రాంతాల స్థానిక సంస్థల ప్రతినిధులు, పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులతో 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డా. అరవింద్ పనగారియా మరియు సభ్యులు డా. మనోజ్ పాండా, రిత్విక్ పాండే, అన్నే జార్జ్ మ్యాథ్యూ, కేకే మిశ్రా, అభయ్ మీనన్, ఆదిత్య పంత్, అమృత తదితర సభ్యులు సమావేశమయ్యారు.

ఇంకా ప్రిన్సిపాల్ సెక్రటరీ ఫైనాన్స్ పీయూష్ కుమార్, అడిషనల్ సెక్రటరీ ఫైనాన్స్ జె. నివాస్, ప్రిన్సిపాల్ సెక్రటరీ పంచాయితీ రాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ శశిభూషన్ కుమార్, డైరెక్టర్ పంచాయితీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ కృష్ణతేజ, ప్రిన్సిపాల్ సెక్రటరీ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ సురేష్ కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, జెసి శుభం బన్సల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల గ్రామీణ స్థానిక సంస్థల నుండి సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ లు పాల్గొనగా అర్బన్ లోకల్ బాడీస్ ప్రతినిధులు మునిసిపల్ మేయర్, చైర్మన్ లు పాల్గొన్నారు.

ప్రస్తుతం అమలవుతున్న వ్యవస్థపై వివరిస్తూ గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్తు, జిల్లా పరిషత్లకు కేంద్రం నుండి నిధుల విడుదల, ఆపన్న హస్తం కొరకు, పట్టణ స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారుల నిర్మాణం, అర్బన్ ట్రాన్స్పోర్ట్, వీధి లైట్లు, మురుగునీటి పారుదల వ్యవస్థ తదితర ముఖ్యమైన అంశాలపై కేంద్రం నుండి నిధుల విడుదల కోసం, ఆర్థిక సాయం కొరకు కమిషన్ దృష్టికి గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు తీసుకెళ్ళారు.

# గోవుల గోల మానండి... టీటీడీ ప్రతిష్టను దిగజార్చకండి

- **టీటీడీ ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి**



**తిరుపతి, ఏప్రిల్ 17 మనం న్యూస్ :** గోవుల సంరక్షణ పేరిట ఒకరిపై ఒకరు పోటాపోటీగా చేసుకుంటున్న విమర్శలను, సవాళ్లు, ప్రతి సవాళ్లు ఆపి వాస్తవాలను భక్తులకు, ప్రజలకు తెలియజేయాలని టీటీడీ ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో కోరారు. అధికార ప్రధాన ప్రతిపక్ష పార్టీల మధ్య సాగుతున్న వివాదం టిటిడిని అప్రతిష్ట పాలు చేసేట్టుగా ఉందని టీటీడీని నమ్ముకుని లక్షలాదిమంది ఉపాధి పొందుతున్నారన్న విచక్షణ కూడా మర్చిపోయి, తాము కూర్చున్న కొమ్మను తామే నరుక్కున్న చందంగా టీటీడీని తమ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం దారుణమని అన్నారు. తిరుపతి ప్రజలు జరుగుతున్న పరిణామాల పట్ల తీవ్ర వ్యతిరేక భావంతో ఉన్నారని కందారపు మురళి వివరించారు. టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలపై విచారణ జరిపించడం లేదా తప్పుడు ఆరోపణలు అయితే చట్టబద్ధ చర్యలు తీసుకోవడం కాకుండా అధికార పార్టీ నాయకులే నానా యాగీ చేయటం, ఐదుగురు ఎమ్మెల్యేలు నేరుగా గోశాల వద్దకు రావడం, జన సమీకరణ చేయడం సమంజసంగా లేదని విమర్శించారు. టీటీడీలో భక్తులు, ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న మౌళిక సమస్యలు అనేకం ఉన్నాయని అలాంటి వాటిపై చర్చ జరపకుండా మూగజీవాలను అడ్డం పెట్టుకుని తమ రాజకీయ ప్రయోజనాలపై విమర్శలు చేసుకుంటూ ప్రజలలో పలుచనపడ్డారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని నిజానిజాలు వెల్లడి చేసి ఈ వివాదానికి ముగింపు పలకాలని కందారపు మురళి కోరారు. గోశాలలో గోమరణాలు జరుగుతున్నాయని ఇరుపక్షాలు చెబుతున్న నేపథ్యంలో దానికి కారణాలపై అన్వేషించి సమగ్రమైన విధానాన్ని రూపొందించాలని ఆయన టీటీడీ యాజమాన్యానికి సూచించారు.

# భూ సమస్యల పూర్తి పరిష్కారమే లక్ష్యంగా భూ భారతి చట్టం

- **పెండింగ్ లో ఉన్నసాదా బైనమా దరఖాస్తులకు మోక్షం**
- **భూమికి భూదార్ సంఖ్య కేటాయింపునకు ప్రణాళిక**
- **భూ భారతి చట్టంలో రెండంచెల అప్పీల్ వ్యవస్థ ఏర్పాటు**
- **భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమము లో జిల్లా కలెక్టర్ దివాకర**

**తాడ్వాయి, ఏప్రిల్17(మనం ప్రతినిధి):** భూ సమస్యల పూర్తి పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం రూపకల్పన చేసిందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం తాడ్వాయి మండలం కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన కార్యక్రమము లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు.భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులకు, ప్రజలకు ఒక్కొక్క సెక్షన్, అంశం వారీగా ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025 అమల్లోకి వచ్చిందని అన్నారు. భూ భారతితో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న భూసమస్యలు పరిష్కారం కానున్నాయని అన్నారు.ఈ చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో ఏప్రిల్ 17 నుంచి ప్రతి మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం ఏ సమస్యను ఏ అధికారి... ఎన్ని రోజులలో పరిష్కరించాలి.... అది పరిష్కారం కాకుంటే ఎవరికి అప్పీల్ చేయాలనే దానిపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసిందని తెలిపారు. సీసీఎల్ఏ కు వెళ్లే అవసరం లేకుండా జిల్లా స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారికి, కలెక్టర్ కు అధికారాలు కల్పించారని తెలిపారు. భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయం సరైంది కాదని భావిస్తే కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ వద్ద అపీల్ చేసుకోవచ్చని అన్నారు. గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని అన్నారు. గతంలో తహసిల్దార్ స్థాయిలో పరిష్కారం అయ్యే చిన్న సమస్యలు కూడా



కలెక్టర్ దగ్గరికి వచ్చేవని అన్నారు. వేల సంఖ్యలో దరఖాస్తులు ఉండడంవల్ల పరిష్కరించడంలో జాప్యం జరిగేదని తెలిపారు. భూభారతి ద్వారా కిందిస్థాయి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని, దీనివల్ల చిన్న సమస్యలు మండల స్థాయిలోనే త్వరితగతిన పరిష్కారం అవుతాయని తెలిపారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని అన్నారు. ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ డివిజన్ అధికారి, జిల్లా కలెక్టర్ ఒక నిర్ణయం తీసుకుంటారని అన్నారు. దరఖాస్తుదారునికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్, భూమి ట్రిబ్యునల్ లో అప్పీల్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. భూ భారతి పోర్టల్ లో ఎకరం భూమి మ్యూటేషన్ దరఖాస్తు తో పాటు వారసత్వ ఒప్పంద పత్రం లేదా వీలునామా కాపీ, నిర్దేశించిన తేదీ నుంచి భూమి సర్వే పటం జత చేయాలని, ఈ దరఖాస్తుల పై తహసిల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకుంటారని అన్నారు.కొనుగోలు, దానం, తనఖా, బదిలీ, భాగం పంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసిల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులు మార్పులు చేసి పట్టాదార్ పాస్ పుస్తకం జారీ చేస్తారని తెలిపారు. భూ భారతి చట్టం పై ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఇంచార్జీ సురేష్, , ఎంపిడిఓ సుమన వాణి, వివిధ వర్గాల ప్రజలు, రైతులు, పాల్గొన్నారు.

# బీఎస్ఎన్ఎల్ సలహా సంఘం సమావేశానికి హాజరైన ఎంపీ

**వరంగల్, ఏప్రిల్ 17 (మనం బ్యూరో):** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) నల్లగొండ బిజినెస్ ఏరియా సమావేశానికి ముఖ్య అతిథిగా




హాజరయ్యారు.ఎంపీ రవిచంద్ర నల్లగొండ పానగల్ రోడ్డులో ఉన్న బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం జరిగిన టెలికాం సలహా సంఘం సమావేశానికి హాజరై సంస్థ పురోభివృద్ధికి పలు సూచనలు చేశారు,సలహాలిచ్చారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ,బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు విశేష సేవలందిస్తున్నదన్నారు. అయితే,ఈ రంగంలో ఎప్పటికప్పుడు చోటు చేసుకుంటున్న మార్పులను నిశితంగా గమనిస్తూ, పరిశోధనలకు ప్రాధాన్యతనిస్తూ పోటీ ప్రపంచాన్ని తట్టుకుని మున్ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.మారుమూల ఏజెన్సీ,కొండ ప్రాంతాలకు వారికి కూడా సేవలను విస్తరించాల్సి ఉందని, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనివ్వాలని ఎంపీ రవిచంద్ర సూచించారు. వినియోగదారులకు సత్వరమే ఎటువంటి అంతరాయం లేని మెరుగైన సేవలందించేందుకు అధికారులు,ఉద్యోగులు,క్షేత్ర స్థాయి సిబ్బంది మరింత కృషి చేయాల్సిందిగా ఎంపీ వద్దిరాజు సలహానిచ్చారు.ఈ సమావేశానికి హాజరయ్యేందుకు విచ్చేసిన ఎంపీ రవిచంద్రకు బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పాశ్యం వెంకటేశ్వర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్ గురువయ్య, అధికారులు రవి ప్రసాద్, మురళీ కుమార్ తదితరులు పుష్పగుచ్ఛమిచ్చి హృదయపూర్వక స్వాగతం పలికారు.ఈ సమావేశం అనంతరం అధికారులు ఎంపీ వద్దిరాజుకు మొక్కను అందజేసి శాలువాతో సత్కరించారు, జ్ఞాపికను బహుకరించారు.

## ప్రకృతి – వికృతి

మల్లెకు సుగంధం పూసిందెవరు
కోయిలకు తీపి రాగం నేర్పిందెవరు
కుక్కకు విశ్వాసం నేర్పిందెవరు
నెమలికి నాట్య శిక్షణ ఇచ్చిందెవరు
మబ్బులను వానగా పడమన్నదెవరు
చెట్లకు పండ్లను కాయమన్నదెవరు
చిట్టి చేపకు ఈతను నేర్పిందవరు
పిట్టకు గూడు కట్టడం చెప్పిందెవరు
సాలె పురుగుకు గూడు కట్టిందెవరు
ఆకుకు గాలి శుద్ధి చేయమన్నదెవరు
మట్టికి గింజకు చుట్టరికం కలిపిందెవరు
భూమాతకు హరిత చీర కట్టిందెవరు
నూతిలోకి నీటి ఊటను తెచ్చిందెవరు
ఇవన్నీ అడగకనే ప్రకృతి మాత..
కురిపిస్తున్న అమూల్య వరాలే కదా !
పూల పరిమళ నవ్వుల్ని చిదిమేదెవరు
భూమాత హరిత చీరకు చిల్లులు పెట్టెదెవరు
శుద్ధ గాలికి గబ్బు గరళం కలిపిందెవరు
మట్టి మర్యాదను మట్టికరిపించిందెవరు
తేట జలానికి మురికి కలిపిందెవరు
ఒంటి నిండా ఈర్ష్య నింపికున్నదెవరు
ఒళ్లంతా కుళ్లు ఆలోచనలు చేస్తున్నదెవరు
మాటలో మతలబులను కూర్చిందెవరు
భూస్వర్గాన్ని నరకంగా మార్చుతున్నదెవరు
నమ్మినోళ్లను వెన్నుపోటు పొడిచేదెవరు
నవ్వుల వెనుక కుట్రలు చేసేదెవరు
మానవీయతను హత్య చేస్తున్నదెవరు
నేతిబీరలో నెయ్యి చూపుతున్నదెవరు
ఇవన్నీ ఒల్లంతా విషం నింపుకున్న..
వికృత నరపుంగవుడే కాబోలు !

**- మధుపాళీ**
9949700037

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
- ఎడిటర్

# నిరుద్యోగ నిర్మూలన పగటి కలేనా?




ఏడు దశాబ్దాల స్వాతంత్ర్య భారతదేశ ప్రణాళికలు శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన గణనీయమైన అభివృద్ధి దేశాన్ని ప్రపంచంలో ఐదవ ఆర్థికశక్తిగా నిలిపినప్పటికీ పేదరికం, నిరుగ్యోగ నిర్మూలన ఒక నినాదంగానే మిగిలిపోయింది. భారత దేశం సుసంపన్నమైందే కాని భారతీయులు పేదవారు అన్నట్లు సంపన్నత లేకుండా పేదరికమే ఈ ఆర్థిక వ్యవస్థలో ప్రతిబింబించడం శోచనీయం. పేదరికం,నిరుద్యోగం పరస్పర ప్రభావిత అంశాలు. పేదరికం నిరుద్యోగితకు దారితీస్థే నిరుద్యోగం పేదరికాన్ని విస్తృత పరుస్తుంది . నిరుద్యోగ సమస్య సామాజిక ఆర్థిక సమస్యగా పరిణమించింది. పనిచేయాలన్న ఆసక్తి అర్హతలు ఉన్నప్పటికీ పని లభించని స్థితిని నిరుద్యోగం అంటారు.

నిరుద్యోగ యువతలో అభద్రత, అసహనం ఆందోళన పెరిగి సామాజిక అశాంతికి దారితీయడంశోచనీయం. దేశ యువత నిరాశ నిస్పృహలతో ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు . పెరుగుతున్న నిరుద్యోగ సమస్య ప్రజాస్వామ్య విధానాల ఉనికికి ప్రమాదకరంగా మారుతుంది .నిరుద్యోగం సామాజిక ఆర్థిక సమస్యలు ఏ సమాజంలో అయితే నిరుద్యోగం పెరుగుతుందో ఆ సమాజంలో దార్రిద్యం, అరాచకం, అవినీతి అక్రమాలు సామాజిక ఆర్థిక సంక్షోభాలతో సతమతమతమవుతూ అభివృద్ధికి నోచుకోదు. నిరుద్యోగులు తమ జీవితాలను అనేకఇబ్బందులతో అతి తక్కువ వేతనాలవద్ద అల్ప ఆదాయంతో గడపవలసిన గడ్డు పరిస్థితులు ఎదుర్కోవడం గమనార్హం. ఆహార భద్రత, సామాజిక భద్రత లేకపోవడం పేదరికం లాంటి కారణాలతో చాలామంది కూడు,గూడు, గుడ్డ లేని స్థితిలో జీవితాలు గడుపుతున్నారు . అల్పపౌష్టికాహారం, అనారోగ్యం ఆహార కొరత అల్ప కొనుగోలు శక్తి అల్ప జీవన ప్రమాణాలతో జీవితాలను వెలిబుచ్చుతున్నారు. కనీస అవసరాలు తీర్చుకోడానికి కావలసిన ఆదాయం పొందడం లేదు.

దేశంలో దాదాపు 80 శాతం మంది కార్మికులు కనీస ప్రమాణాలు పాటించని అసంఘటిత రంగంలో తక్కువ వేతనాలకు పనిచేస్తున్నారు. దేశంలో కేవలం ఏడు శాతం మంది మాత్రమే ఆర్థిక ఉద్యోగ, భద్రత ఉన్న పరిశ్రమల్లో పనిచేస్తున్నారు.

భారత ఆర్థిక వ్యవస్థలో 7శాతం వార్షిక వృద్ధి జరిగినప్పటికి ఉద్యోగాల కల్పనలో వెనుకబడి వున్నాం. ఉద్యోగాల కోసం ఎదిరి చూసే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. 1972-73 సంవత్సరాల తర్వాత నిరుద్యోగిత రేటు పెరుగుతుందనిఅనేక అధ్యయనాల్లో తేలింది. 2004-05 నుంచి2011-12 సంవత్సరాల మధ్య చదువుకున్న గ్రామీణ ప్రాంత మహిళల్లో నిరుద్యోగిత శాతం7.5నుండి15.2 శాతం మధ్య ఉండగా 2017-18సంవతరం నాటికి 17.3 శాతానికి పెరిగిందని 'ఎన్ఎస్ఎస్' నివేదిక తెలిపింది. కేంద్ర ప్రభుత్వ సిఎంఇ నివేదిక ప్రకారం దేశంలో ఆదాయ వనరులు తగ్గడం కొత్త ప్రాజెక్టులు రాకపోవడం ప్రైవేట్ రంగంలో ఉద్యోగుల సంఖ్య తగ్గడం కరోనా మహమ్మారి వల్ల ఆర్థిక వ్యవస్థ కుదేలు కావడం. దేశీయంగా డిమాండ్ బాగా తగ్గడం పెరుగుతున్న ధరలు ఆర్థిక రికవరీ నెమ్మదిగా పెరగడం లాంటి అంశాలు ఉద్యోగ అవకాశాలను దెబ్బతీస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గణాంకాలు



వెల్లడించాయి. 'ఆర్థిక మందగమనం' లాక్ డౌన్ వల్ల నిరుద్యోగం పెరిగిందని 'సి ఎంఐ' పేర్కొంది. నిరుద్యోగిత పెరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దేశంలో అత్యధిక నిరుద్యోగిత (23.2 శాతం)జమ్ము కాశ్మీర్ వుండగా 8 యేళ్ల తెలంగాణ రాష్ట్రం (8.3 శాతం)తో 8వ స్థానంలో వుంది. ధనిక రాష్ట్రంగా గుర్తించబడిన తెలంగాణలో ఉద్యమ ఆకాంక్ష ఐయిన ఉపాధి కల్పన కలగానే మిగిలిపోయింది.

### రాష్ట్రంలో తగ్గుతున్న ఆదాయవనరులు

2021 డిసెంబర్ నాటికి 23.4 శాతం వున్న ఆదాయ వనరులు 2022 మార్చి నాటికి20.8 శాతానికి తగ్గాయి. తగ్గుతున్న ఆదాయాలు పెరుగుతున్న ఖర్చులు 2021 డిసెంబర్ నాటికి 21.3 శాతం వుంటే 2022 జూన్ నాటికి ఖర్చులు 41.7 శాతానికి పెరిగాయి. సెప్టెంబర్ లో ఆదాయ మార్గాలను బట్టి ఖర్చు శాతం 22.3 గా నమోదు అయింది. పాత ప్రాజెక్టులు మూతపడం కొత్త ప్రాజెక్టులు రాకపోవడం ఉన్న ప్రాజెక్టుల్లో రేషనలైజేషన్ విధానాలను అమలు చేయటంవల్ల ఉద్యోగుల తొలగింపుతో నిరుద్యోగం పెరుగుతుంది. శ్రామిక జనాభాకు అనుకూలంగా ఉపాధి అవకాశాలు పెరుగుకపోవడం. జనాభా పెరుగుదల ఎక్కువ జనాభా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉండటంతో నిరుద్యోగ సమస్య జటిలం గా పరిణమించింది.

### ప్రభుత్వ విధానాలు... ఉపాది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

అవలంబించిన ఆర్థిక విధానాలు అమలు చేసిన 'సూక్ష్మ' స్థూల స్థాయి ప్రణాళికలు యువతకు ఉపాధి కల్పనలో విఫలం కావడం వల్ల గ్రామీణ యువత పట్టణాలకు వలస వెల్లి అసంఘటిత రంగములోఎక్కువ పనిగంటలు పనిచేస్తూ అల్ప వేతనాలు పొందుతూ శ్రమదోపిడికి గురౌతున్నారు.ప్రభుత్వాల ఆర్థిక విధానాలు ప్రభుత్వ రంగంలో పెట్టుబడుల ఉపసంహరణ కార్పొరేట్ రంగానికి,ప్రైవేట్ రంగానికి పెద్ద పీట వేసే సంస్కృతి రాజ్య మేలడం, అన్ని రంగాలలో పేరుకుపోయిన అవినీతి పాలకుల ఉదాసీనత వైఖరి, ఉపాధి కల్పనను ఒక కలగా 'మార్చివేశాయి. పాలక పార్టీలు ప్రతిపక్ష పార్టీలు యువతను ఓటు బ్యాంక్‌గా ఉపయోగించుకునే సంస్కృతి మారాలి. రాజకీయ పార్టీలు నిరుద్యోగ సమస్య నివారణ పట్ల అనుసరించే పద్దతులను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలి.నిరుద్యోగ నిర్మూలనకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. ప్రతిరాజకీయ పార్టీ యువత విభాగాన్ని ఏర్పాటు చేసి 'యువత సాదికారిత'సాధన దిశగా శిక్షణ అవగాహన చైతన్య సదస్సులు సమావేశాలు నిర్వహించాలి.యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించాలి. యువతను ఉత్పాదకవనరుగా తీర్చిదిద్దాలి.ఎన్నికల ముందు 'ఉచితాలు 'ఆర్థిక ప్రలోభాలతో' యువతకు మాయమాటలు చెప్పి గెలిచిన తర్వాత ఉపాధి కల్పన పట్ల సాచివేత ఉదాసీనత నిర్లక్ష్య విధానాలను అవలంబించడం వల్ల యువతకు ఉపాధి కల్పన ఎండమావిగా మారింది. ఉద్యోగ వయోపరిమితి పెంపు, నిరుద్యోగ భృతి లాంటి తాత్కాలిక తాయిలాలు ప్రకటించడం మీద చూయించిన శ్రద్ధ అధికారంలోకి వచ్చిన మరుక్షణమే మరిచి పోవడంలో పోటీ పడే రాజకీయ సంస్కృతికి చరమగీతం పాడాలి. ప్రతి ఎం.పి,ఎంఎల్ ఏ తన నియోజక పరిధిలో ఉన్న ప్రభుత్వ ప్రైవేట్ రంగాలలలో వున్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడానికి ఉద్యోగ నియామక క్యాలెండర్ రూపొందించి అమలుచేయాలి.


నేటికీ సమగ్రమైన జాతీయఉపాధి కల్పన విధానం లేక పోవడం వల్ల వేలాది మంది నిరుద్యోగులు ఆత్మహత్యాలకు పాల్పడి అనేక మంది తల్లి తండ్రులకు గర్భ శోకం కలిగిస్తున్నారు. దేశ జనాభాలో 60శాతం మించి వున్న యువతకు పని కల్పించి నపుడే దేశం ప్రగతి సాధిస్తుంది. యువతకు కావలిసింది వయోప రిమితి పెంచడం కాదు. ఎదో ఒక రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించి దేశ ప్రగతికి పురోగతికి కృషి చెయ్యాలి. ప్రజలు యువత ఉద్యోగాలు ఆశించే స్థాయి నుండి శాసించే స్థాయికిస్వశక్తితో ఎదుగాలి .ప్రభుత్వ ఉద్యోగాలకు ఎదిరి చూడకుండా తమకు అభిరుచి వున్న రంగాలలో ప్రవేశించి ఉద్యోగాలు సృష్టించి తోటి వారికి ఉద్యోగం చూయించే స్థాయికి ఎదుగాలి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలలో నిరుద్యోగ నిర్మూలనకు 'ప్రత్యేక మంత్రిత్వ శాఖను'ఏర్పాటు చెయ్యాలి. పాలకవర్గాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్య శాశ్వత పరిష్కారానికి దీర్ఘకాలిక ఉపాధి,ఉద్యోగ కల్పన విధానాలను అమలు చెయ్యాలి. సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి వ్యూహాలు అమలు చేయాలి. సమగ్రమైన ఆర్థిక పెట్టుబడి ఉపాధితో కూడిన సమ్మిళిత ఆర్థికాభివృద్ధి వ్యూహాలను అమలు చెయ్యాలి. అప్పుడే నిరుద్యోగ సమస్యకు ఒర పరిష్కారం దొరుకుతుందని ఆశిద్దాం

**- నేదునూరి కనకయ్య**
9440245771

# చదువుకునేదా! కొనేదా?



ఈ ప్రపంచంలో రోజురోజుకు ఎన్నో విధాలుగా ఎన్నో రంగాలలో అనేకమైన మార్పులు సంతరించుకుంటున్నాయి. కానీ కొన్ని వ్యవస్థల్లో మాత్రం మార్పు రాకుండా ఉండి అలానే కొనసాగుతున్నాయి.అవి నిర్ణయించుకున్న లక్ష్యాలను ధ్యేయంగా చేసుకొని ముందుకు సాగుతున్నాయి.ఆ ప్రయాణంలో మానవత విలువలను ,మంచిని కాలరాస్తున్నాయి.అందులో ప్రధానమైన రంగం విద్యారంగం. ఈ రంగం కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల మధ్య నలుగుతూ ఆలోచనతో విద్యార్థులకు తల్లిదండ్రులకు స్థాయికి మించిన ఆశలతో ప్రలోభాలతో ఏరవేసి వారి ఆర్థిక స్థితిగతులను ఆసరాగా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుత కాలంలో విద్య అనే వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా దిగ్విజయంగా విరాజిల్లుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు ఆనంద డోలికల్లో తెలి ఆడుతున్నాయి.నేటి కార్పొరేట్ విద్యాసంస్థలు తమ ఆలోచన సరళిని మార్చుకోకుండా అతి దారుణమైన పంథాను కొనసాగిస్తూ విద్యాలయాలను వ్యాపార కేంద్రాలుగా మార్చి ఆర్థిక కార్యకలాపాలను జోరుగా సాగిస్తున్నాయి. అడ్మిషన్లు వేటకు పిఆర్ఓ వ్యవస్థను ఏర్పాటు



చేసుకొని మారుమూల ప్రాంతాలను, పల్లెలను సైతం కార్పొరేట్ విద్యా భూతం వేటాడుతుంది. ప్రాథమిక విద్య నుండి మొదలుకొని ఉన్నత స్థాయి విద్య వరకు పేద ,ధనికవర్గాల భేదం లేకుండా ఫీజుల దోపిడీకి తెరతీస్తుంది.బహుళా అంతస్తుల్లో హాస్టల్ వసతిని చూపుతూ ఆధునిక హంగులని,సాంకేతిక నైపుణ్యంతో కూడిన విద్యాబోధన అని చెబుతూ అమాయకపు తల్లిదండ్రులను ఆర్థికంగా కొల్లగొడుతూ పీల్చి పిప్పి చేస్తున్నారు. ఇదే కాకుండా ఉన్నత విద్యను పూర్తి చేసిన విద్యావంతులను నిరుద్యోగ యువతను సైతం కార్పొరేట్ మహమ్మారి వేధిస్తుంది.ఉద్యోగాల పేరా వారి సంస్థల్లో స్థానం కల్పించి అవసరాలకు వారి నైపుణ్యాలతో పాటు విద్యాసంస్థల అభివృద్ధికి వాడుకొని విపత్కరమైన కరోనా లాంటి పరిస్థితుల్లో విద్యావంతులను రోడ్డు పాలు చేసిన అపకీర్తి ఈ కార్పోరేట్ శక్తులకు ఉంది.కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యావిధానాన్ని, విద్యారంగానికి సంబంధించిన పరిపాలనను సైతం తమ కనుసన్నల్లో నియంత్రించుకుంటూ విద్యా అనే వాణిజ్య రంగంలో తనదైన శైలిలో విజయబావుటను ఎగరవేస్తుంటే పాలకులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

విద్యాపరమైన పాలన యంత్రాంగాన్ని కూడా వారికి సానుకూలంగా మార్చుకుంటూ అనుకూలమైన ప్రకటనల ప్రచారంతో పలు రకాల ప్రలోభాలతో ప్రసన్నం చేసుకుంటూ కార్పొరేట్ విద్యాసంస్థల వ్యాప్తిని విస్తరించుకుంటున్నారు. విద్యాశాఖకు సంబంధించిన ఉన్నతాధికారుల చేయూతతో పాలకులు వీటికి కాపు కాస్తుడటంతో కార్పొరేట్ శక్తుల ఆగడాలు విపరీతంగా పెరిగాయి. టెక్నో ఈ టెక్నో ,డిజీ ,ఒలంపియాడ్ ఐఐటీ అనే ఆకర్షించే పేర్లతో జనాలను ఆకట్టుకుంటూ విద్యార్థులను తల్లిదండ్రులను మోసపూరిత మాటలతో అయోమయానికి గురి చేస్తున్నారు. విద్య అనేది వ్యక్తిత్వ నిర్మాణంతో పాటు ఉన్నతమైన ఆలోచనలకు ఆచరణకు నాంది కావాలి.దేశ సమగ్రతకు సమాజాభివృద్ధికి ఉపయోగపడాలి తప్ప నేడు విద్యా అనేది కార్పొరేట్ శక్తుల వాణిజ్య వనరుగా మారి కేవలం మార్కులకు, ర్యాంకులకు పట్టం కడుతూ విలువలను పారేస్తున్నారు. లక్షలలో ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి పూర్తిస్థాయిలో జీతాలు చెల్లించకుండా మానసికంగా వేధిస్తున్నారు. పరిస్థితులకు అనుగుణంగా ఫీజుల నియంత్రణపై పాలకులు పూర్తిస్థాయిలో ఒక సమగ్రమైన కార్యచరణ రూపొందించాలి. కార్పొరేట్ విద్యాసంస్థల అరాచకపు ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలి. విద్యా వ్యవస్థను వ్యాపార ధోరణితో చూసే విద్యాసంస్థలను ఎప్పటికప్పుడు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి రాబోయే తరాలకు విద్య పట్ల విద్యా వనరుల పట్ల గౌరవాన్ని పెరిగేలా చర్యలు చేపట్టాలి.

కాసుల పంట పండిస్తుందనే ఆలోచన ప్రజల్లో మొదలైంది .కార్పొరేట్ శక్తుల నియంతృత్వ ఆలోచనలతో నేడు విద్య విలవిలలాడుతుంది .పూర్వం విద్యాలయాలు, గురుకులాలు ఎన్నో ఆశ్రమాలు కేవలం వ్యక్తిత్వ నిర్మాణానికి మానవత విలువలకు పెద్దపీట వేస్తూ ఆశ్రయించిన ప్రతి ఒక్కరికి నిస్వార్థంగా విద్య బుద్ధులతో పాటు విచక్షణమైన జ్ఞానాన్ని, విలక్షణ, జ్ఞానమైన బోధన చేసేవారు. కానీ నేడు ఆ పరిస్థితులు భిన్నంగా మారాయి .మారుతున్న కాలంతో పాటు సాంకేతికతను, పాశ్చాత సంస్కృతిని అందిపుచ్చుకొని చదువుకునే వారు కాస్త చదువు కొనేవారుగా మారారు. అనడంలో సందేహం లేదు. విపరీతమైన మానసిక ఒత్తిడులు మధ్య మితిమీరిన ప్రణాళికల సమయపాలనలతో నేడు విద్యా విధానం విద్యార్థి లోకం అయోమయ స్థితిలో కృంగిపోతుంది. అడ్డు అదుపు లేని

**- వంశీకృష్ణ గౌడ్ బండి**
9550837962

పరువు హత్యాలా?

# అహంకారపు అకృత్యాలా?





వేరే కులం, వేరే మతం వారిని ప్రేమించారన్న కారణంతో కొన్ని చోట్ల కూతుర్ని, మరికొన్ని చోట్ల ఆమె ప్రేమించినవాడిని బలితీసుకుంటున్న అమానుష దృశ్యాలు మన చుట్టూ నిత్య కృత్యంలా మారాయి. చిన్నతనం నుంచి ఎంతో అల్లారు ముద్దగా పెంచిన తమ పిల్లలని ఎదిగిన తరువాత తన ఇష్టానుసారం నచ్చిన వాడిన ప్రేమించి పెళ్లి చూసుకోవడం నేరంగా చూస్తున్న కొంత మంది తల్లిదండ్రులు పరువు అనే భ్రమలో విచక్షణ మరిచి ప్రవర్తిస్తున్నారు.

పరువు హత్యలు అనే ముసుగులో కన్న వారిని క్రూరంగా చంపుకుంటున్నారు, ఇది పరువు కోసం కాదు - కుల దురహంకారపు అకృత్యం.

తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన పరువు హత్యల పేరిట జరుగుతున్న దురహంకార హత్యలు - ఇది ప్రేమ మీద మాత్రమే దాడి కాదు, కులం, మతం, మనిషి మనుగడ మీద దాడి!

మిర్యాలగూడలో ప్రణయ్, సూర్యాపేటలో కేసులు మీడియా లోకానికి తెలిసినవే. కానీ ప్రతి రోజు ఇలాంటివి ఎన్నో సమాజంలో జరుగుతున్నాయి. అలాంటి వాటిల్లో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు మావత్వానికి మాయని మచ్చగా, కుల, మతోన్మాదదానికి పరాకాష్టగా మారాయి..

అనంతపురం జిల్లాలో తండ్రి,తన కూతురు వేరే కులం వాడిని ప్రేమించిందనే కారణంతో దారుణంగా హత్య చేయడం,హయత్ నగర్‌లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న చెల్లెలు కులాంతర వివాహం చేసుకుందని నడిరోడ్డుపై తమ్ముడు నరికి చంపడం, చిత్తూరు జిల్లాలో ప్రేమించి మతాంతర వివాహం చేసుకున్న యువతి అనుమానాస్పద మృతి. ఇలాంటివి ఎన్నో ఇటీవల కాలంలో మానవ సంబంధాలను ఛిద్రం చేస్తూ మనగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి,. రక్త సంబంధికులే రాక్షసుల్లా ప్రవర్తిస్తున్న సంఘటనలునానాటికి పెరుగుతున్నాయి..

క్షణికావేశంలో చేస్తున్న పనులకు జీవితాంతం తమ కుటుంబాలలోను క్షోభను మిగిలిస్తున్నారు.. వేరే కులం, వేరే మతం వారిని ప్రేమించారని కన్న పిల్లలని చంపడం పరువా? కాదు మానవత్వానికి మాయని మచ్చ, ఆటవిక క్రూరత్వానికి పరాకాష్ట, అది గౌరవం కాదు - అది ఓ క్రూరమైన అహంకారపు చీకటి కోణం, ఇలాంటి చర్యల వలన పరువు పెరగటం కాదు వున్న పరువు పోయి జీవితాంతం నేరస్థుడిగా మిగిలి కుటుంబాలకు క్షోభను మిగిలించడం తప్ప ఏమి ఉపయోగం ఉండదు.

### స్త్రీల స్వేచ్ఛపై నియంత్రణ

అమ్మాయి తనకు ఇష్టమైన వ్యక్తిని ప్రేమించడం, వివాహం చేసుకోవాలనుకోవడం వంటి విషయాలు కొన్ని కుటుంబాల్లో తట్టుకోలేరు. వారు తీసుకునే నిర్ణయాన్ని అవమానంగా భావించి హత్యలు చేస్తున్నారు.

'మీ ఇంటి పిల్ల పరువు తక్కువ పని చేసింది?' అన్న మాటలు వింటే తట్టుకోలేమనే భయం. తాతలు, పినతండ్రులు, బంధువుల మాటల వల్ల కుటుంబ పెద్దల గౌరవాన్ని కాపాడుకోవాలనే మానసిక స్థితిలో హింసకు పాల్పడుతున్నారు.

'మా ఇంట్లో ఇలాంటివి జరుగటం సిగ్గు' అని భావించి, అది తప్పు కాకపోయినా పిల్లలపై కోపాన్ని పెంచుకొని ప్రాణాలు తీయడం లాంటి అసహనంలో విచక్షణ మరిచి పెద్దలు ఒక సైకోలా వ్యవహరిస్తున్నారు. సహ జీవనం...సమాజం వీటిని ఒప్పుకోకపోవడం, కుటుంబ గౌరవం దెబ్బతింటుందనే అపనమ్మకంతో హత్యలకు పూనుకుంటున్నారు. పెద్దలు, కుటుంబ సభ్యులు పిల్లల మానసిక స్థితిని, ప్రేమను,అభిప్రాయాలను ఆలోచనలను అర్థం చేసుకోలేకపోవడం. ఎన్ని కఠిన చట్టాలు ఉన్నా - మారాల్సింది ఆలోచనా విధానం.

ఈ పరువు హత్యలు నివారించడానికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. కుటుంబాలలో, పాఠశాలల్లో, గ్రామస్థాయిలో ప్రేమ, సంబంధాలు, వివాహ స్వేచ్ఛ, వ్యక్తిగత హక్కులపై అవగాహన కల్పించాలి. 'పరువు' అన్నది ప్రాణాల కంటే పెద్దది కాదని తెలియ చేయాలి.

పరువు హత్యలకు ప్రత్యేక చట్టాలు రూపొందించాలి. అతి త్వరగా విచారణలు జరిపి శిక్షలు అమలు చేయాలి. దోషులెవ్వరైనా క్షమించరాదని న్యాయవ్యవస్థ స్పష్టంగా చాటాలి. పిల్లలపై పట్టు కాదు, ప్రేమతో బంధం అవసరమని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లల అభిప్రాయాలను వినే పరిస్థితిని కల్పించాలి. ప్రేమ, వయసు, అర్థం చేసుకోవడం, సంయమనం అనే అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలి. సంబంధాల్లో స్పష్టత, బాధ్యత అనే భావనలు అనుభవంలోకి వచ్చే విధంగా సొంతంగానే ఎదగాలి.

అమ్మాయిలకు స్వేచ్ఛ, విద్య, ఆత్మవిశ్వాసం ఇవ్వాలి. వారు తమ నిర్ణయాలు తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండాలి. మత, కుల సంఘాల నేతలతో చర్చలు,కుల సంఘాలు, మత నాయకులు ప్రగతిశీలమైన సందేశాలు ఇచ్చేలా ఒత్తిడి తేవాలి. మతాల పేరుతో హింసను ప్రేరేపించే కార్యక్రమాలు నియంత్రించాలి. క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాల్సి ఉంది. గ్రామాల్లో, క్షేత్ర స్థాయిలో వీటి పట్ల స్వచ్ఛంద సంస్థలు, పోలీస్‌లు మొదలైన వారు వీటి పట్ల అవగాహన కల్పించాలి. ఈ మార్గాలు సమగ్రంగా అమలవుతే పరువు హత్యలు అరికట్టగలం. పరువు కోసం ప్రాణాలు తీసే సమాజం కన్నా ప్రేమ కోసం ప్రాణాలు కాపాడే సమాజమే అవసరం.

కులం, మతం కంటే ముందు మనమంతా మనుషులం అని గుర్తుంచుకోవాలి. ఏ కులం, మతం కూడా ప్రేమను ద్వేషించదు చంపమని చెప్పదు, మనిషి ఏర్పరుచుకున్న పరువు అనే భ్రమలో విచక్షణ మరిచి కొందరు ఆడుతున్న వికృత క్రీడలు ఇవి ఏ సమాజం వీటిని హర్షించదు. మహాకవి గురజాడ 'మతములన్నియు మాసిపోవును...జ్ఞానమొక్కటె నిలిచి వెలుగును... అంత స్వర్గ సుఖంబులన్నవి అవని విలసిల్లున్' కొంత మంది యువకులు పుట్టుకతో వృద్ధులుగా కాకుండా ఆలోచనాపరులుగా మసులుకోవడం చాలా అవసరం. నేటి యువత నిర్ణయాలు తాత్కాలిక ఫలితాలను ఆశించడం వల్ల ఈ దారుణాలు చోటు చేసుకుంటున్నాయి.

**- జి. అజయ్ కుమార్**




## కళ్ళు

అందరికి రెండు కళ్ళు
దైత్యగురువు శుక్రాచార్యునికి మినహాయింపు
ఒక కన్ను
అందరికి రెండు కళ్ళు
కైలాసనివాసి భక్తుల శ్రేయోబిలాషి
శివునికి మినహాయింపు
మూడు కళ్ళు
అందరికి రెండు కళ్ళు
దేవరాజు అమరేంద్రునికి మినహాయింపు
వేయికళ్లు
రేవగళ్లు రెప్పవాల్చని
దేహం త్యాగం చేసే సరిహద్దు సైనికునికి
ఒళ్ళంతా కళ్ళు

**- కోటం చంద్రశేఖర్**
9492043348

## విస్ఫోటనం!



కూలిన చెట్లే మాట్లాడుతాయి
నేలరాలిన పక్షులే నిలదీస్తాయి
చెల్లాచెదురైన జంతుజాలమే
నలు దిశలా ప్రచార రథాలవుతాయి!

గాయాలకు మందొక్కటే సరిపోదు
నిలువ నీడ లేని చోట
మూగజీవాలు సైతం
తిరుగుబాటు జెండా లౌతాయి!

మనకెందుకులేనని
మనం చెవులు మూసుకున్నా
న్యాయదేవత స్వయంగా వింటది
రంగ ప్రవేశం చేసి అండై నిలుస్తది!

అడవి ఎవరి జోలికి పోదు
సకల జీవరాశులను
కోడి పిల్లల్ని చేసుకుని
కొమ్మల చాటున దాచుకుంటది!

స్వార్థం మితిమీరినప్పుడు
తనతో తాను ఘర్షించుకుని
నిలువెత్తు అగ్ని జ్వాలై
రేపటి మనుగడని ప్రశ్నార్థకం చేస్తుంది!

పంచభూతాలతో
ఎవరు చెలగాటమాడినా
ఎప్పుడైనా ఒక ప్రళయమే
ఊహించని ఒక విస్ఫోటనమే!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261.

# గుర్తింపు సంఘం ప్రతినిధులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం



**రామగిరి ఏప్రిల్ 17 మనం న్యూస్:** రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో గుర్తింపు సంఘం అయినటువంటి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులతో గురువారం జి.యం. కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లతో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎం.రామచంద్రారెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో భాగంగా ఓసిపి-2 ఇ.పి.ఆపరేటర్స్ ఉద్యోగులకు విశ్రాంతి గది నిర్మించడం, ఓసిపి-2 నందు నూతన మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకు నిర్మించడం, ఓసిపి-1, ఓసి పి-2 ఉపరితల గనులలో భారీ యంత్రాల ఎ.సి.లు మరమ్మతు చేయించడం, ఎస్.ఎం.ఎస్. ప్లాంట్ నుండి ఓసిపి-1 లారీ చెక్ పోస్ట్ వరకు గల రోడ్డు వెడల్పు చేయడం, ఓసిపి-1 లోని ఫేస్-2 కార్యాలయాన్ని వాడుకలోకి తీసుకురావడం, అడ్రియాల లాంగ్ వాల్ గని నందు విధులు నిర్వహిస్తూ అండర్ గ్రౌండ్ అన్ ఫిట్ అయినా ఉద్యోగులకు సర్ఫేస్ కి ట్రాన్స్ఫర్ చేయడం, ఉపరితల గనులలో చలువ పందిళ్లు వేయడం, అడ్రియాల లాంగ్ వాల్ గని 3(ఎ) సీమ్ కు వెళ్లే లైట్ వెహికిల్ వాహనాలకు దారిని ఏర్పాటు చేయడం, సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహించే పోస్టులకు షెల్టర్ ఏర్పాటు చేయడం, బెల్ట్ సైడ్ పని స్థలాలలో లైటింగ్ ఏర్పాటు చేయడం, సెంటినరీ కాలనీ ఉద్యోగుల నివాస గృహాలకు రోజూ నీటి సరఫరా చేయడం, రాంనగర్ వైపు రుద్రమదేవి క్రీడా ప్రాంగణంనకు నిర్మించిన ప్రహరీ గోడ వెంబడి డ్రైనేజీ కాలువ నిర్మించడం లాంటి పదకొండు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జి.యం.లు మాట్లాడుతూ ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అదేవిధంగా కార్పోరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు జూపాక రాంచందర్, డి.తిరుపతి రావు, ఎస్.విజయ్ రాఘవ, ఇంచార్జ్ ఎస్వోటుజిఎం బి.వి. సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు జె.రాజశేఖర్, ప్రవీణ్.వి.ఫాంటింగ్, విభాగాధిపతులు కె.చంద్రశేఖర్, కాశీ విశ్వేశ్వర రావు, బి.సుదర్శనం, బి.రాజేంద్రకుమార్, కె.వి.రామారావు,ఉదయభాస్కర్, అధికారులు మతీన్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యా ఇటిక్యాల చెరువును పరిరక్షించరా

- **చెరువు పరిరక్షణ కమిటీ కన్వీనర్ సప్ప రవి**



**లక్షెట్టిపేట, ఏప్రిల్ 17(మనం న్యూస్) :** ఇటిక్యాల చెరువు ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్ ల హద్దులు నిర్ణయించి చెరువును పరిరక్షించాలని గురువారం మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ కు చెరువు పరిరక్షణ కమిటీ కన్వీనర్ సప్ప రవి ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెరువు పరిరక్షణ కమిటీ కన్వీనర్ సప్ప రవి మాట్లాడుతూ.. ఈ చెరువుపై సుమారుగా 500 కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, ఇప్పటికీ 4గురు కలెక్టర్లు మారిన మాకు న్యాయం చేయలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజులు గడిచే కొద్ది చెరువు మాయమయ్యేలా ఉందని తమరైన మాకు న్యాయం జరిగేలా చూడాలి అంటూ ప్రాధేయపడ్డాడు. కలెక్టర్ స్పందిస్తూ.. చాలా రోజులుగా మా నోటీసులో ఉంది. ఈ విషయమై స్థానిక ఎమ్మార్వో తో కూడా చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నాను. సాధ్యమైనంత వరకు అన్ని విధాలా మీకు న్యాయం జరిగేలా చూస్తాను. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే ఎఫ్ టీ ఎల్ హద్దులు ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎఫ్ టీ ఎల్ బఫ్ఫర్ జోన్ విషయంలో కలెక్టర్ ని ప్రశ్నించగా.. అది తమ పరిధిలో లేదని ఇరిగేషన్ శాఖ వారు నిర్ణయిస్తారని సమాధానం దాటవేయడం కొసమెరుపు.

## ప్రభుత్వం ఏర్పాటు చేసిన భూ భారతి చట్టంపై అవగాహన కల్పించాలి




- **జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 17 ( మనం న్యూస్):** ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన భూభారతి చట్టంపై జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అవగాహన కల్పించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన. అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.భూభారతి చట్టం రైతుల చుట్టం అని భూ హక్కుల భద్రం, భూ సమస్యల పరిష్కారం ప్రజా పాలనలో మార్పు అని అన్నారు. అనంతరం ఎమ్మార్వో జి ప్రసాద్ భూభారతి చట్టంలోని కీలక అంశాలను వివరించారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 1900 సాదా బైనమాల క్రమబద్ధీకరణకు, వారసత్వంగా వచ్చిన భూములకు మోటివేషన్ కు 30 రోజుల కాల వ్యవధి ఉంటుందని దీనిపై ఆపీల్ వ్యవస్థ చట్టం తీసుకువచ్చిందని వివరించాడు. ఇకనుండి వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకి మ్యాప్ జారీ చేయనున్నట్లు తెలిపారు. రికార్డుల్లో తప్పులు సవరణ గురించి సవివరంగా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ పరిధి బిజెపి పార్టీ ఆధ్వర్యంలో కమిషనర్ అమరేందర్ రెడ్డి కి వినతి పత్రం



**తుర్కయంజాల్, ఏప్రిల్ 17( మనం న్యూస్):** మున్సిపాలిటీ పరిధి కోహెడ గ్రామ బిజెపి నాయకులు, హనుమాన్ జయంతి వేడుకలకు, వేసిన తోరణాలను, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల, విగ్రహానికి వేసిన తోరణాలను, తొలగించవద్దని, గురువారం కమిషనర్ అమరేందర్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు నరసింహారెడ్డి సీనియర్ నాయకులు కంధాల బలదేవ రెడ్డి, బిక్షపతి, యూసుఫ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భీంగల్ పోలీస్ స్టేషను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్




**భీంగల్, ఏప్రిల్ 17 (మనంన్యూస్):** నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య భీంగల్ పోలీస్ స్టేషన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ మొత్తం కలియ తిరిగి పోలీస్ స్టేషన్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. రిసిప్షన్ సెంటర్ పనితీరును , కంప్యూటర్ సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. 5ఎస్ విధానం అమలు చేస్తున్నారా లేదా అడిగి తెలుసుకొని మొత్తం చూసారు. వాహనాల పార్కింగ్ చూసారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ప్రధానంగా ఎక్కువ ప్రమాదాలుద్విచక్రవాహనాదారులకు జరుగుతున్నందున, తప్పనిసరి హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని సూచించారు. గంజాయి నిర్మూలనకు అధికారులకు ఆదేశాలు జారీచేయడం జరిగిందని, ఎవరయిన గంజాయికి బానిస అవుతే వారికి కౌన్సిలింగ్ చేయాలని తెలిపారు , దాని నిర్మూలనకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. సైబర్ మోసగాండ్ల నుండి ప్రజలు మోసపోకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. గెమింగ్ అప్ ల పట్ల ప్రజలు మోసపోకుండా ఎప్పటికప్పుడు వారికీ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిాచాలని అన్నారు. సిబ్బంది సాధక బాధలు ప్రతీ ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఏ.సి.పి వెంకటేశ్వర్లు, ఆర్మూర్ రూరల్ సి.ఐ. శ్రీధర్ రెడ్డి, భీంగల్ సి.ఐ. సత్యనారాయణ, భీంగల్ ఎస్.ఐ జి.మహేష్, కమ్మర్పల్లి ఎస్.ఐ జి.అనిల్ కుమార్ ,ఎర్గట్ల ఎస్.ఐ రాము, మోర్తాడు ఎస్.ఐ విక్రమ్. మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



**చేవెళ్ల , ఏప్రిల్ (మనం న్యూస్):** ఈనెల 27న వరంగల్ లో మండల కేంద్రంలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు మండలం నుండి భారీగా తరలి వెళ్లి సభను విజయవంతం చేయాలని డి సి ఎం ఎస్ చైర్మన్ పి.కృష్ణా రెడ్డి పేర్కొన్నారు. గురువారం బిఆర్ఎస్ నాయకులు చలో వరంగల్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... మండలంలోని గ్రామాల్లోసన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి కార్యకర్తలను అత్యధికంగా తరలించాలని క్లస్టర్ ఇన్చార్జీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి




**చిలుకూరు, ఏప్రిల్ 17 (మనం న్యూస్):** సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సింజంట తెలంగాణ డివిజన్ టెక్నికల్ డెవలప్మెంట్ మేనేజర్ డాక్టర్ అబ్దుల్ రషీద్ అన్నారు. గురువారం చిలుకూరులో సింజంట కంపెనీ వారి ఆధ్వర్యంలో వరిలో సుడిదోమ నివారణకు వెస్టోరియా ప్రో అనే నూతన ఆవిష్కరణ వల్ల పంట దిగుబడులు పెరిగాయని అన్నారు. ఈ సందర్భంగా రైతులకు పంట క్షేత్ర ప్రదర్శన నిర్వహించి, వరిలో వచ్చే ప్రధాన సమస్యలు, పరిష్కార మార్గాలు వివరించారు. అదిక దిగుబడులు ఏలా సాదించాలో తెలిపారు. ఈ కార్య క్రమంలో హైదరాబాద్ డివిజన్ బిజినెస్ మేనేజర్లు నవీన్ రెడ్డి,కళ్యాణ్ ,టెరిటరీ మేనేజర్ సంతోష్ రెడ్డి ,టీఎండీఈ రామకృష్ణ, ఎండిఓ స్ గుండు డు .రామకోటి కే జగదీష్ ఏ మహేష్ ఎస్ వెంకటేష్ కే రమేష్ వెంకటేష్ ఫెర్టిలైజర్ షాప్ యజమానులు రైతులు పాల్గొన్నారు.

## ఎల్.ఆర్. ఎస్. రుసుము చెల్లింపు ప్రక్రియ వేగవంతం చేయాలి

- **రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్**




**నస్పూర్, ఏప్రిల్ 17(మనంన్యూస్):** ఎల్.ఆర్.ఎస్.-2020 పథకంలో భాగంగా లే-అవుట్ లేని భూముల క్రమబద్ధీకరణ కోసం అందిన దరఖాస్తులకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల నుండి రుసుము వసూలు ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులతో ఎల్.ఆర్. ఎస్. రుసుము వసూలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ ఎల్.ఆర్.ఎస్.-2020 పథకంలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 30వ తేదీ లోగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, రుసుము చెల్లించిన వారికి ప్రొసీడింగ్స్ అందజేయాలని తెలిపారు. ప్రక్రియ నిర్వహణలో ఏమైనా సాంకేతిక సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు రుసుము వసూలుపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్.ఆర్.ఎస్.-2020 పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్దిదారుల నుండి ఎల్.ఆర్.ఎస్. రుసుము వసూలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు రుసుము పూర్తి స్థాయిలో చెల్లించే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, రుసుము వసూలు ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు



**గంగాధర, ఏప్రిల్ 17 (మనం న్యూస్):** నిషేధిత గంజాయి కలిగి ఉన్న ముకేష్ అనే వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్సై బి. వంశీకృష్ణ పేర్కొన్నారు. గంగాధర మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామ శివారులో గల రైస్ మిల్లులో పని చేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ముకేష్ అనే వ్యక్తి గంజాయి కలిగి ఉన్నాడని పక్కా సమాచారం మేరకు ఎస్ఐ సాయంత్రం నిందితుని పట్టుకొని అరెస్ట్ చేసి అతని దగ్గర నుండి 68 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వారు పేర్కొన్నారు. నిందితుడు ముకేష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గంజాయి నిర్మూలనకు పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టిందని, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై మత్తు పదార్థాలకు బానిస కాకుండా దృష్టి సారించాలని కోరారు. నిషేధిత గంజాయి ఎవరైనా సేవించిన, విక్రయించిన, కొన్నా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

# ధరణి పోర్టల్‌కు భూభారతి పోర్టల్‌కు చాలా తేడా

- **నూతన చట్టంలో మరో 14 అంశాలను చేర్చిన ప్రభుత్వం**
- **పూర్తి వివరాలను సేకరించిన అనంతరమే రిజిస్ట్రేషన్లు**
- **జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



**ములుగు, ఏప్రిల్ 17(మనం ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన భూ భారతి పోర్టల్ కు గతంలోని ధరణి పోర్టల్ కు చాలా తేడా ఉందని, భూముల విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలగవద్దని ఉద్దేశంతో ప్రభుత్వం మరో 14 అంశాలను పొందుపరిచిందని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టం, దాని పద్ధతులు అనే రెండు అంశాలను ప్రభుత్వం ఆధారంగా తీసుకొని భూమాతను ఏర్పాటు చేయడం జరిగిందని, భూముల విషయంలో ఎలాంటి సమస్యలు ఏర్పడిన సంవత్సర కాలంలో పరిష్కరించుకోవడానికి అవకాశం కల్పించిందని వివరించారు. భూ సమస్యలపై గతంలో కోర్టులను ఆశ్రయించే వారని నేడు కోర్టులను ఆశ్రయించకుండానే షెడ్యూల్ (ఏ) ను ఏర్పాటు చేసి భూమి విలువ 5 లక్షల లోపు ఉన్నపక్షంలో ఆర్డీవో స్థాయి, 5 లక్షలకు పైగా ఉన్న పక్షంలో కలెక్టర్ స్థాయి అధికారులు సమస్యను పరిష్కరించడానికి అవకాశం కల్పించారని తెలిపారు. భూమి విషయంలో దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఆరోజు నుండి సంవత్సరకాలం లోపు సమస్యను పరిష్కరించడం జరుగుతుందని, కలెక్టర్ స్థాయిలో సమస్య పరిష్కారం కాని పక్షంలో సీసీఎల్ఏ కు ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్ బోర్డు భూములను ఎవరైనా ఆక్రమించి పట్టాలు చేసుకున్న పక్షంలో కేసులను నమోదు చేయడం జరుగుతుందని, గుడ్డిగా రిజిస్ట్రేషన్ చేసే అవకాశాలు ఏ మాత్రం ఉండవని అన్నారు. జిల్లాలో వెంకటాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని ఆ మండలంలోని అన్ని గ్రామాలలో రెవిన్యూ సదస్సులు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని, మే ఒకటి నుండి 31 వరకు పరిశీలన చేసిన అనంతరం జూన్ 2వ తేదీన పట్టాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా లోని మిగతా మండల కేంద్రాల్లో అవగహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఒక గ్రామ పరిధిలోని భూముల వివరాలు పూర్తిగా తహసిల్దార్, ఆర్డీఓ, కలెక్టరేట్, ఖజానా కార్యాలయంలో పొందుపరచడం జరుగుతుందని, జమాబంధు తరహాలో భూభారతిపోర్టల్ కొనసాగుతుందని అన్నారు. అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ తెలిపారు.

## పశువులకు టీకాలు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం



**చిలుకూరు, ఏప్రిల్ 17 (మనం న్యూస్):** వచ్చే నెల 14 వ తేదీలోపు జిల్లా లో వంద శాతం పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు పూర్తి స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసినట్లుగా జిల్లా ఇన్చార్జి పశువైద్యాధికారి రవి ప్రసాద్ తెలిపారు. గురువారం చిలుకూరు పశువైద్యశాలలో గాలి కుంట నివారణ టీకాల కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పశువులకు తప్పని సరిగా గాలి కుంట నివారణ టీకాలు వేయించాలని సూచించారు. పశువులు వ్యాధి భారీన పడకుండా ప్రభుత్వం ఉచితంగా అందించే గాలి కుంట టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లాలోని ప్రతి పశువుకు టీకా వేసి ఆన్లైన్ నమోదు చేయనున్నట్లుగా తెలిపారు. అనంతరం చిలుకూరు పశువైద్య సహాయకులుగా పని చేస్తూ పశు సంపద సహాయకులుగా పదోన్నతి పొందిన పి. శ్రీవాణిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోదాడ ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పెంటయ్య, పశువైద్యాధికారులు వీరారెడ్డి, శ్రీనివాస్, సురేందర్, సిబ్బంది. రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఐకెపి కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి

- **సన్న వడ్ల కు ప్రభుత్వం ఇచ్చే 500 బోనస్ పొందండి**
- **ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి రైతు సుభిక్షంగా ఉండాలి**
- **ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్**



**కురవి, ఏప్రిల్ 17(మనం న్యూస్):** ఆరుగాలం కష్టపడి ఎండనక వాననక పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక పోతే రైతు వేదన రైతు ప్రభుత్వానికి తెలుసు కాబట్టే సన్న వడ్లకు 500 బోనస్ ఇచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ అన్నారు. గురువారం కురవి, సిరోలు మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అయ్యగారి పల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం అంటే రైతు ప్రభుత్వం అని రైతు ప్రభుత్వంలో రైతులకు న్యాయం చేస్తున్నామని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఉద్దేశంతోటే 500 రూపాయలు బోనస్ సన్న వడ్లకు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రభుత్వాన్ని కూల్చేద్దాం అంటున్నారు అని అన్నారు. 10 సంవత్సరాలు టిఆర్ఎస్ పార్టీ పాలించి ప్రజల సొమ్ము దోచుకో తిని రుచి మరిగిన కుక్కలాగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. టిఆర్ఎస్ నాయకత్వం కాంగ్రెస్ పడగొడితే ప్రజలు చూస్తూ ఊరుకోరని కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు అభిమానులు నిప్పు రవ్వలై కనికలై ఉద్యమిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి సత్యనారాయణ. మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం. మాజీ జెడ్పిటిసి బండి వెంకటరెడ్డి. పిఎసిఎస్ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి. వీరభద్ర స్వామి ఆలయ చైర్మన్ కొర్ని రవీందర్ రెడ్డి. వీరభద్ర స్వామి ఆలయ మాజీ చైర్మన్ బండి లక్ష్మారెడ్డి. జిల్లా సీనియర్ నాయకులు బండి శ్రీనివాస్ రెడ్డి. మండల నాయకులు తవణం సుఖేందర్ రెడ్డి. గ్రామ పార్టీ అధ్యక్షుడు దొంగలు జనార్ధన్ రెడ్డి. కార్యదర్శి జక్కుల నాగన్న. మండల నాయకులు తవణం సుఖేందర్ రెడ్డి. పాల్గొన్నారు.

# భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి 'భూ భారతి' చట్టం దోహదం

- అవగాహన సదస్సులలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు





**నిజామాబాద్, ఏప్రిల్ 17(మనంప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి' నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్పల్లి, మోర్తాడ్ మండల కేంద్రాలతో పాటు, ఏర్గట్ల మండలం బట్టాపూర్ లో భూభారతి నూతన చట్టంపై రైతులకు గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులలో కలెక్టర్ పాల్గొని, భూభారతి చట్టంపై, అందులోని అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ రైతులకు సవివరంగా అవగాహన కల్పించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు. భూమి హక్కుల భద్రత, భూ సమస్యల సత్వర పరిష్కారం, రైతుల మేలు కోసం చారిత్రక మార్పు దిశగా ఈ నూతన ఆర్ఓఆర్ చట్టం ఉపకరిస్తుందని, రైతుల భూములకు భరోసా లభిస్తుందని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కల్పించే ఈ చట్టంపై అవగాహనను ఏర్పర్చుకోవాలని, భూ సమస్యలు కలిగిన రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని నాలుగు మండలాలలో దీనిని ఈ నెలాఖరు వరకు ప్రయోగాత్మకంగా అమలు చేస్తారని, క్షేత్రస్థాయిలో ప్రభుత్వం దృష్టికి వచ్చే ఇతర ఏవైనా అంశాలు, సమస్యలను కూడా పరిశీలించి ఈ చట్టంలో చేర్చడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మే మొదటి వారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో భూభారతి చట్టాన్ని అమలు చేస్తారని అన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో భూభారతి నూతన చట్టంపై సదస్సులు నిర్వహించి రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. రెవెన్యూ అధికారులే గ్రామాలకు వచ్చి అర్జీలు స్వీకరిస్తారని, నిర్ణీత కాల వ్యవధిలోపు వాటిని పరిష్కరిస్తారని అన్నారు. భూ వివాదాల విషయంలో అప్పీలు చేసుకున్న పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం సమకూరుస్తారని సూచించారు. ఈ చట్టం ప్రవేశపెట్టిన ఏడాది కాలం లోపు భూ సంబంధిత సమస్యలపై అర్జీలు పెట్టుకునే అవకాశం కల్పించారని వివరించారు. భూ సమస్యల పరిష్కారానికి రెండంచెల వ్యవస్థ ఉంటుందని, ఈ. చట్టం ద్వారా రైతులకు వారి భూముల వివరాలతో కూడిన భూధార్ కార్డులను కేటాయిస్తారని తెలిపారు. భూ సమస్యలు తెలుసుకుని సులభతరంగా పరిష్కరించేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయ భూములతో పాటు వ్యవసాయేతర, మిగితా అన్ని రకాల భూముల రికార్డులు రెవెన్యూ కార్యాలయంలో నమోదు అయి ఉంటాయని అన్నారు. ఇదివరకటి ధరణిలో రికార్డుల నిర్వహణ లేదని, ఇప్పుడు రికార్డుల నిర్వహణ ఉంటుందని, భూమి కలిగిన ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో 'భూధార్' కార్డు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. గతంలో ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే అప్పీల్ వ్యవస్థ లేదని సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆర్డీఓ, కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిలలో అప్పీల్ వ్యవస్థ ఉందని, ప్రతి అంశం భూభారతి పోర్టల్ లో ఉంటుందని, ఎవరైనా వారి భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న భూభారతి చట్టంలోని నిబంధనల ప్రకారం రికార్డులను అప్డేట్ చేయడం జరుగుతుందన్నారు. కాగా, భూ సమస్యలు, లోటుపాట్ల సవరణ వంటి వాటి కోసం రైతులు మధ్యవర్తులను, దళారులను ఆశ్రయించవద్దని, ఎవరికీ ఎలాంటి డబ్బులు ఇవ్వకూడదని సూచించారు. అసైన్ మెంట్ భూములకు సంబంధించి కూడా త్వరలోనే ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలను జారీ చేయనుందని తెలిపారు. ఈ సందర్భంగా భూభారతి చట్టంలోని కీలక అంశాలైన భూ రికార్డులలో తప్పుల సవరణ, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్, ఇతర మార్గాల ద్వారా వచ్చిన భూమికి మ్యుటేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, పట్టాదారు పాసు పుస్తకాలు, అప్పీల్ వ్యవస్థ, రివిజన్ అధికారాలు, గ్రామ రెవెన్యూ రికార్డులు, రికార్డుల నకలు పొందడం ఎలా అనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని అన్నారు. అనంతరం ఆయా అంశాలపై రైతులు వెలిబుచ్చిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఇంకనూ ఈ నూతన చట్టంలో ఎలాంటి అంశాలు చేరిస్తే బాగుంటుందనే దానిపై సలహాలు సూచనలు చేయవచ్చని అన్నారు. ఈ సదస్సులలో ఆర్మూర్ ఆర్డీఓ రాజా గౌడ్, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగులు సమాజసేవలో భాగస్వాములు కావాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

**నిజామాబాద్, ఏప్రిల్ 17(మనం న్యూస్):** సుభాష్ నగర్ లోని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ వారి నూతన భవనం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొనడం జరిగింది..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు కేంద్ర, రాష్ట్ర శాఖలలో పని చేసి పదవి విరమణ పొందిన సీనియర్ సిటిజన్స్ అందరు వారి అనుభవాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలని అన్నారు. విశ్రాంత




ఉద్యోగులు గుర్నాల సరోజినమ్మ ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు వారు చేస్తున్న సేవ కార్యక్రమాలను కొనియాడారు.రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల బినిఫిట్స్ ఇతర సమస్యలను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని అలాగే విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమం కొరకు యోగ కేంద్రం, లైబ్రరీ ఏర్పాటుకు ప్రభుత్వ నిధులు సమాకూర్చేల కృషి చేస్తానని హామీ ఇచ్చారు.నూతనంగా ఏర్పాటు చేసిన సంఘం భవనం ఉపయోగానికి ధన్ పాల్ లక్ష్మి భాయ్ విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ధ్వారా వంద కుర్చీలు అందచేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న ప్రముఖులను ఎమ్మెల్యే సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్, దశరథ్ డిప్యూటీ డైరెక్టర్ ట్రెజరరీ శాఖ, రసూల్ భీ మహిళా శిశు సంక్షేమ, వయో వృద్ధుల శాఖ జిల్లా అధికారిణి, పి. కృష్ణా మూర్తి . రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆల్ పెన్స్ నర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మోర్తాడ్ లో ఐకెపి, పాక్స్, కస్తూర్బా విద్యాలయం సందర్శించి పరిశీలించిన కలెక్టర్

**మోర్తాడు, ఏప్రిల్ 17(మనం న్యూస్):** బాల్కొండ నియోజకవర్గం లో గల మోర్తాడ్ మండలములోని ఐ కె పి, పాక్స్ ఆధ్వర్యములో ఏర్పాటు చేసినటువంటి వరి కొనుగోలు కేంద్రాలను, మోర్తాడ్ లోని కస్తూర్బా విద్యాలయం ను జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం రోజున ఆకస్మికంగా విచ్చేసి సందర్శించి పరిశీలించారు. వరి కొనుగోలు కేంద్రంలో రైతుల వద్ద కొనుగోలు ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. మండల కేంద్రమైన మోర్తాడ్ లో గల కస్తూర్బా విద్యాలయ బాలికల పాఠశాలలో కలెక్టర్ స్వయంగా డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. మెనూ ప్రకారం పట్టికలో పొందుపర్చిన వాటికి, అనుగుణంగానే ఆహార పదార్థాలు ఉన్నాయా లేవా,



విద్యార్థులకు పట్టిక మేరకు భోజనం అందిస్తున్నారా లేదా అని అని తనిఖీ చేయడమే కాకుండా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.. మెనూ ప్రకారం ఉడకబెట్టిన కోడిగుడ్లు, నిర్ణీత రోజులలో మాంసాహారం అందిస్తున్నారా అని ఆరా తీశారు. భోజనం తయారు చేసేందుకు వినియోగించే ఆహార పదార్థాలు, సరుకులు, కూరగాయలు కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించేలా, వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. మెను పట్టికలో ప్రకారం విద్యార్థులకు భోజనం అందించేలా నాసిరకమైన బియ్యం, ఇతర ఆహార పదార్థాలు, కూరగాయలు సరఫరా చేసిన సమయంలో అధికారులకు సమాచారం వెంటనే అందించి మార్పిడి చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని విద్యాలయ ప్రిన్సిపల్, అధ్యాపకులకు, సంబంధిత మండల అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రూరల్ డెవలప్మెంట్ అధికారి, సివిల్ సప్లై అధికారులు,ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, మోర్తాడ్ మండల ఎంపీడీఓ తిరుమల, మోర్తాడ్ మండల తహశీల్దార్ కృష్ణ, ఆర్. ఐ. రంజిత్ కుమార్, ఐకెపి ఎపిఎం ప్రమీల, ఐకెపి సీసీలు, సొసైటీ అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.స్వప్న, కస్తూర్బా మహిళ ఉపాధ్యాయులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ బిల్ చట్టం చట్టబద్ధతపై సుప్రీంకోర్టులో విచారణ షురూ

- సుప్రీంకోర్టులో కేసు దాఖలు
- ప్రభుత్వ సలహాదారుడు మొహమ్మద్ షబ్బీర్ అలీ

**నిజామాబాద్, ఏప్రిల్ 17(మనంప్రతినిధి):** కాంగ్రెస్ పార్టీ తరపున రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కేసు దాఖలు చేశారు.ఈ కేసును సల్మాన్ ఖుర్షీద్ బృందం వాదిస్తున్నారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూవక్ఫ్ (సవరణ)చట్టం-2025 చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం ప్రారంభించిందన్నారు.సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్లతో కూడిన ధర్మాసనం పిటిషన్లపై విచారణ చేపట్టిందన్నారు ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం సైతం కేవియెట్ దాఖలు చేసిందని, విచారణకు ముందు సుప్రీంకోర్టు తమ ఎదుట రెండు ప్రశ్నలు ఉన్నాయని పేర్కొంది.మొదటిది కేసును విచారించాలా? లేదంటే హైకోర్టుకు అప్పగించాలా? అని.. రెండోది న్యాయవాదులు వాదించాలనుకుంటున్న అంశాలపై తెలిపింది. ఓ పిటిషనర్ తరఫున తమ సీనియర్ న్యాయవాదుల బృందం వాదనలు వినిపించారు.పార్లమెంట్ చట్టం ద్వారా మత విశ్వాసంలో కీలకమైన అంతర్భాగ అంశాల్లో తలదూర్చడమే అన్నారుఆర్టికల్ 25, 26లకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని



సుప్రీంకోర్టుకు తెలిపామన్నారు. చట్టం ప్రకారం' అనే పదాలు అనే పదాలు ముస్లిం మతానికి సంబంధించిన ముఖ్యమైన ఆచారాన్ని ప్రభావితం చేస్తాయని,ఈ పదబంధం ఇస్లాం మతానికి సంబంధించి మౌలికమైన ఆచారాలను దూరం చేస్తుందని పేర్కొన్నారు. వక్ఫ్-అలల్-ఔలాద్ను సృష్టించినప్పుడు మహిళల వారసత్వ హక్కులను నిరాకరించరాదని.. దీనిపై ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకోగలదన్నారు. ఎవరైనా వక్ఫ్ను స్థాపించాలనుకుంటే.. అతను ఐదేళ్లు ఇస్లాంను పాటిస్తున్నాడని నిరూపించుకోవాల్సి ఉందన్నారు. ఆస్తుల సర్వే బాధ్యత కలెక్టర్కు ఇచ్చారని.. ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. గతంలో ముస్లింలు మాత్రమే వక్ఫ్ కౌన్సిల్, బోర్డులో భాగమని.. సవరణ తర్వాత హిందువులు కూడా భాగం కావొచ్చని.. ఇది పార్లమెంటరీ చట్టం ప్రాథమిక హక్కులను ప్రత్యక్షంగా ఉల్లంఘించ డమేనన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుపై మాకు పూర్తి స్థాయి నమ్మకం ఉందని తప్పకుండా మాకు న్యాయం జరుగుతుందన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

## మస్క్ వంటి వారు అరుదుగా కనిపిస్తారు: పొగిడిన పుతిన్

**మాస్కో, ఏప్రిల్ 17:** టెస్లా సారథి ఎలాన్ మస్క్ను రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ పొగడ్తలతో ముంచెత్తారు. టెస్లా బాస్, డోజ్ సారథి ఎలాన్ మస్క్ను గతంలో సోవియట్ కాలం నాటి రాకెట్ శాస్త్రవేత్త సెర్గీకొరొలోవ్తో ఆయన్ను పోల్చారు. మాస్కోలోని బౌమన్ యూనివర్శిటీలో విద్యార్థులను ఉద్దేశించి పుతిన్ ప్రసంగించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మస్క్ వంటి వ్యక్తులు చాలా అరుదుగా కనిస్తారన్నారు. ''మీకు తెలుసా.. అమెరికాలో మస్క్ అనే వ్యక్తి ఉన్నాడు. అతడు అంగారక గ్రహం



గురించిన కలలను గొప్పగా చెబుతుంటాడు. మానవ జాతిలో ఇలాంటి వారు చాలా అరుదు. అతడి కలలు కొంతకాలం తర్వాత వాస్తవరూపం ధరిస్తాయి. అలాంటి వ్యక్తులు చాలా అరుదుగా కనిపిస్తారు. ఈ రోజున నాకు నమ్మశక్యం కానివి భవిష్యత్తులో నిజాలు అవుతాయి.

అంతకుముందు జర్నలిస్ట్ టకర్ కార్ల్సన్తో మాట్లాడుతూ ''ఎలాన్ మస్కుకు ఎదురులేదు'' అని పుతిన్ వ్యాఖ్యానించారు. 2023 ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరమ్లో పుతిన్ మాట్లాడుతూ ఎలాన్ ఓ అసాధారణ వ్యక్తి.. ప్రతిభావంతుడైన వ్యాపారవేత్త. ఈ విషయాన్ని ప్రపంచం మొత్తం గుర్తించింది అని పుతిన్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

స్టార్లింక్కు రష్యా నుంచి ముప్పు..

ఓవైపు పుతిన్ మస్కును పొగుడుతున్నా.. మరోవైపు స్టార్లింక్ ప్రాజెక్టుకు రష్యా నుంచి ముప్పు పొంచి ఉందని సెక్యూర్ వరల్ ఫౌండేషన్ సంస్థ విడుదల చేసిన రిపోర్టులో పేర్కొంది. 316 పేజీల ఈ నివేదికలో పలు అంశాలను ప్రస్తావించింది. ఉపగ్రహాలను కూల్చే సామర్థ్యం మొత్తం 12 దేశాలకు ఉన్నట్లు వెల్లడించింది. ఉక్రెయిన్ యుద్ధంలో 2022 నుంచి స్టార్ లింక్ వినియోగం మొదలుపెట్టినా.. 2024లో మాత్రం కొన్ని సమస్యలు ఎదురయ్యాయని వెల్లడించింది. రష్యా పరీక్షిస్తున్న ఎలక్ట్రానిక్ వార్ఫేర్ వ్యవస్థల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తినట్లు వెల్లడించింది.

# ఆర్థికంగా కుప్పకూలుతున్న హమాస్..!



**గాజా, ఏప్రిల్ 17:** గాజాకు చెందిన మిలిటెంట్ సంస్థ హమాస్కు ఆర్థిక కష్టాలు తీవ్రమయ్యాయి. దాని శ్రేణులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందట. గాజాకు చెందిన మిలిటెంట్ సంస్థ హమాస్ నిధులలేమితో కటకటలాడుతోంది. కనీసం సంస్థలోని సభ్యులకు కూడా చెల్లింపులు చేయలేని స్థితికి జారిపోయింది. ఈ పరిస్థితిని అరబ్ ఇంటెలిజెన్స్ వర్గాలు గ్రహించాయట. ఈ విషయాన్ని గురువారం వాల్స్ట్రీట్ జర్నల్ కథనంలో పేర్కొంది. గాజాలోకి వెళ్లే మానవీయ సాయంలో ఇజ్రాయెల్ భారీగా కోత విధించడంతో.. హమాస్ దోచుకోని విక్రయించుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని ఆ పత్రిక పేర్కొంది. దీంతో పాటు ఆ సంస్థలో నిధుల పంపిణీకి బాధ్యత వహించేవారిని గుర్తించి మరీ ఇజ్రాయెల్ దళాలు అంతం చేస్తున్నాయి. హమాస్ గాజాకు చేరే మానవీయ సాయాన్ని పక్కదారి పట్టించడం, స్థానిక వ్యాపారులు, ప్రజలపై పన్నులు విధించడం వంటి చేసి సొమ్మును పోగేసేవి. విదేశీ నగదుతో బయట మానవీయ సాయం కొనుగోలు చేసి గాజాలో అత్యధిక ధరలకు విక్రయించి లాభపడేది. జనవరిలో కాల్పుల విరమణ వేళ గాజాలోకి మానవీయ సాయం, నిధుల పంపిణీ పెరిగింది.. కానీ, మార్చి నాటికి వీటిని బాగా తగ్గించారు. దీంతో హమాస్ శ్రేణులకు అందే సొమ్ముల్లో కూడా భారీగా కోతపడింది. వాస్తవానికి ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం మొదలు కావడానికి ముందు ప్రతినెలా దాదాపు 15 మిలియన్ డాలర్లు ఖతార్ నుంచి లభించేవి. దీంతోపాటు ఏటా 500 మిలియన్ డాలర్లు ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి నిధుల రూపంలో వచ్చేవి. గాజాలో పోరు మొదలయ్యాక నిధుల రాక బాగా కష్టతరంగా మారిపోయింది. అమెరికా ఆంక్షలు కూడా దీనికి కారణంగా నిలిచాయి. యుద్ధం ప్రారంభంలో బ్యాంక్ ఆఫ్ పాలస్తీనా శాఖల నుంచి 180 మిలియన్ డాలర్లు తీసుకొన్నట్లు అక్కడి అధికారులు చెబుతున్నారు.

## అధిక వడ్డీలు వసూలు చేస్తున వారిపై పోలీసుల మెరుపు దాడులు

- జిల్లా పోలీస్ కమీషనర్ సాయి చైతన్య

**నిజామాబాద్ క్రైమ్, ఏప్రిల్ 17(మనం న్యూస్):** నిజామాబాద్ జిల్లాల వ్యాప్తంగా అక్రమంగా అధిక వడ్డీ వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చట్టరీత్య చర్యలు చేపట్టడానికి రంగం సిద్ధం చేశామని ఏసిపి రాజా వెంకటరెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని పోలీస్ కమీషనరేట్ పరిధిలో గల నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్నీ చోట్ల అధిక వడ్డీ లు వసూలు చేస్తు ప్రజలను ఇబ్బంది పెడుతున్న వారిపై నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య, ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు దాడులు నిర్వహించడం జరుగుతుందని ఎసిపి రాజా వెంకటరెడ్డి అన్నారు. తెల్లవారుజామున మెరుపు దాడులు నిర్వహించడం జరిగిందని ఆయన. అధిక వడ్డీ వసూలు చేస్తున్న వారిపై ఫిర్యాదు వచ్చిన మరోక్షణం పోలీస్ శాఖ పరమైన చట్టాలను పరిగణంలోకి తీసుకొని చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.



## పాపాలు కడిగేసుకునేందుకే మాపై బురద

**ఢిల్లీ, ఏప్రిల్ 17:** కేంద్రంలోని బీజేపీ సర్కారు తమ సొంత పాపాలను కడిగేసుకునేందుకు కాంగ్రెస్ నేతలను లక్ష్యంగా చేసుకుని బురద జల్లుతోందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ బెదిరింపులకు తమ పార్టీ ఏమాత్రం భయపడిపోయేది లేదని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు గళం వినిపిస్తూనే ఉంటామని స్పష్టంచేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్గాంధీలపై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అభియోగపత్రం నమోదు చేయడం మీద సామాజిక మాధ్యమ



వేదికగా బుధవారం మండిపడ్డారు. మోడీ సర్కారు తన పాపాలను కప్పిపుచ్చుకోవడానికే, నేషనల్ హెరాల్డ్ కేసును తెరపైకి తెస్తోందని విమర్శించారు. ''మోడీ సర్కారుకు ఓ స్పష్టమైన దార్శనికత లేదు. దేశ సమస్యలకు పరిష్కారాలను చూపించలేని పరిస్థితుల్లో కేంద్రం ఉంది. ఆర్థిక వ్యవస్థ గాడి తప్పింది. అన్నివర్గాల్లో నైరాశ్యం అలముకుంది. అందుకే ప్రజల దృష్టిని మళ్లించే కుతంత్రాలను ప్రభుత్వం రూపొందిస్తోంది. వాణిజ్యలోటు మూడేళ్లలో ఎన్నడూ లేనంత ఎక్కువగా ఉంది. టారిఫ్ యుద్ధంపై స్పష్టత కొరవడింది. ఊకదంపుడు మాటలు, నిష్ఫల పర్యటనలే మిగిలాయి. పెట్రోలు, డీజిల్పై పన్నులు, సుంకాల రూపేణా మోడీ సర్కారు రూ.39 లక్షల కోట్లు పిండుకుంది'' అని ఖర్గే విమర్శించారు. సోనియా, రాహుల్పై ఈడీ ఛార్జిషీటును నిరసిస్తూ పెద్దఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు ఢిల్లీలోని అక్బర్ రోడ్లోఉన్న ఏఐసీసీ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. వివిధ రాష్ట్ర రాజధానుల్లో ఈడీ కార్యాలయాల ఎదుట పార్టీ శ్రేణులు నిరసనలు చేపట్టాయి.

# పాక్ దుర్బుద్ధి.. కశ్మీర్ను మర్చిపోలేకపోతోందట..!

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 17:** కశ్మీర్ను తాము మర్చిపోలేమంటూ పాక్ తన దుర్బుద్ధిని బయటపెట్టింది. అంతర్జాతీయ వేదికలపై ఎన్ని మొట్టికాయలు పడినా పాకిస్థాన్ తన వైఖరిని మార్చుకోవడం లేదు. జమ్మూకశ్మీర్ పేరు చెప్పి, భారత్ను నిందలపాలు చేయాలని పాకులాడి బోర్లా పడుతున్నా దాని బుద్ధి మారడం లేదు. తాజాగా దాయాది దేశం ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ మళ్లీ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. అది తమ జీవనాడి అని, దానిని మర్చిపోలేమని వ్యాఖ్యానించారు.

ఇస్లామాబాద్లో ఓవర్సీస్ పాకిస్థానీస్ కన్వెన్షన్లో మునీర్ మాట్లాడారు. ''విదేశాల్లో నివసిస్తోన్న పాకిస్థానీయులంతా దేశ రాయబారులు. మీరు ఉన్నతమైన భావజాలం, సంస్కృతికి చెందినవారనే విషయాన్ని మర్చిపోకూడదు. మీరు మీ పిల్లలకు పాక్ స్టోరీ చెప్పాలి. హిందువులతో పోలిస్తే మనం భిన్నమని మన పూర్వీకులు భావించారు. మన సంస్కృతి, ఆచార సంప్రదాయాలు, ఆశయాలు భిన్నం. అదే రెండు దేశాల సిద్ధాంతానికి పునాది వేసింది. ఈ దేశం ఏర్పాటు కోసం మన పూర్వీకులు ఎంతో పోరాడారు. ఈ స్టోరీని తర్వాత తరాలకు చెప్పడం మర్చిపోవద్దు. అప్పుడే వారికి పాకిస్థాన్తో ఉన్న బంధం దృఢంగా ఉంటుంది'' అని మాట్లాడారు.



''ఉగ్రవాద కార్యకలాపాల వల్ల పాకిస్థాన్కు పెట్టుబడులు రాకపోవచ్చని చాలామంది భయపడుతున్నారు. ఉగ్రవాదులు దేశ భవిష్యత్తును హరించగలరని మీరు భావిస్తున్నారా..?''అంటూ భారత సైన్యాన్ని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్కు బలోచిస్థాన్ గర్వకారణమన్నారు. అలాగే కశ్మీర్ గురించి మాట్లాడుతూ.. ''ఈ విషయంలో మా వైఖరి స్పష్టం. కశ్మీర్ సోదరులను మేం అలా వదిలేయం'' అంటూ అసిమ్ మునీర్ బీరాలు పలికారు.

# ఆ మంత్రిపై కేసు నమోదు చేయండి..

- లేకపోతే కోర్టు ధిక్కరణే: మద్రాస్ హైకోర్టు



**చెన్నై, ఏప్రిల్ 17:** తమిళనాడు మంత్రి పొన్ముడి ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారంపై మద్రాస్ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. వెంటనే ఆయనపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. లేనిపక్షంలో కోర్టు ధిక్కార చర్యగా పరిగణిస్తామని హెచ్చరించింది. ''ఈ వ్యవహారాన్ని కోర్టు తీవ్రంగా పరిగణిస్తోంది. దీనిపై ఫిర్యాదు లేకపోయినా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయండి'' అని జస్టిస్ ఎన్.ఆనంద్ వెంకటేశ్ పేర్కొన్నారు. అనంతరం కేసు విచారణను ఏప్రిల్ 23కి వాయిదా వేశారు. ఇటీవల చెన్నైలో ఓ కార్యక్రమంలో పొన్ముడి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సెక్స్ వర్కర్, కస్టమర్ మధ్య సంభాషణ ఇలా ఉందంటూ.. అసభ్యకర పదజాలాన్ని ఉపయోగిస్తూ మాట్లాడిన వీడియో నెట్టింట వైరల్ అయ్యింది. మంత్రి మాట్లాడిన తీరు మహిళలను కించపర్చేలా ఉందంటూ.. ఆయనపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. డీఎంకే ఎంపీ కనిమొళి, గాయని చిన్మయి, నటి ఖుష్బూతోపాటు పలువురు ప్రముఖులు ఆయన తీరును ఖండించారు. మరోవైపు.. డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ఆయనను పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తొలగించారు.

# స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రను విజయవంతంగా నిర్వహించండి

- **జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య**



**కర్నూలు, ఏప్రిల్ 17: (మనం న్యూస్) :** ఏప్రిల్ 19 వ తేదీన నిర్వహించే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంను విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం, వాట్సాప్ గవర్నెన్స్ అంశాల పై జిల్లా అధికారులు, మండల స్పెషల్ అధికారులు, మండల అధికారులతో జాయింట్ కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 3వ వారంలో నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల థీమ్ ఈ వేస్ట్ కలెక్షన్ గా ప్రభుత్వం నిర్వహించనున్నారు..ఇందులో భాగంగా ఈ నెల ఎలెక్ట్రానిక్ వేస్ట్ ను సేకరించి డిస్పోస్ చేయాలన్నారు..... ఇందుకోసం మున్సిపాలిటీలలో రెడ్యూస్ రీసైకిల్ రీయూస్ (ఖఖఖ) సెంటర్లను ఉపయోగంలోకి తీసుకొని రావాలన్నారు...కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీలతో పాటు గూడూరు నగర పంచాయతీలలో కూడా రెడ్యూస్ రీసైకిల్ రీయూస్ (ఖఖఖ) సెంటర్లను కలెక్షన్ పాయింట్లుగా పెట్టుకోవాలన్నారు.. అదే విధంగా పంచాయతీలో కూడా ఒక సెంటర్ ను ఎలెక్ట్రానిక్ వేస్ట్ కలెక్షన్ పాయింట్ గా ఏర్పాటు చేసుకోవాలన్నారు.. గ్రామాలలో ఎక్కువ ఎలెక్ట్రానిక్ వేస్ట్ కలెక్షన్ పాయింట్ లు ఉండవు కాబట్టి అన్నిటిని కలిపి అర్బన్ సెంటర్ కు తీసుకొని వచ్చి వాటిని డిస్పోస్ చేయాలన్నారు... ఆదోని, ఎమ్మిగనూరు కలెక్షన్ పాయింట్లు ఆదోని లో ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూల్ డివిజన్ కి సంబంధించిన ఈ వెస్ట్ కలెక్షన్ ను కర్నూలు మున్సిపాల్టీ కి తరలించాలన్నారు... ఆదోని లో కలెక్ట్ చేసిన వాటిని డిస్పోస్ చేసిన తర్వాత కర్నూలు మున్సిపాల్టీ కి తరలించారన్నారు... ఈ కార్యక్రమాలను మొక్కుబడిగా కాకుండా శ్రద్ధతో నిర్వహించాలన్నారు.. అదే విధంగా ఎక్కువ మొత్తంలో ఈ కార్యక్రమాలను మీడియా రూపంలో కవరేజ్ చేయించి పెద్ద ఎత్తున్న ప్రచారం చేయించాలన్నారు.ఎలెక్ట్రానిక్ వేస్ట్ కలెక్షన్ కి సంబంధించి సేఫ్ కలెక్షన్ , సేఫ్ డిస్పోసల్ పై స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ డిఆర్డిఏ, మెప్మా, జిల్లా పరిషత్ సీఈఓ, డిపిఓ లను ఆదేశించారు... ఎలెక్ట్రానిక్ వేస్ట్ మీద అవగాహన కల్పించే విధంగా శనివారం పెద్ద ఎత్తున క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు అదేవిధంగా వాట్సాప్ గవర్నెన్స్ కి సంబంధించి క్యాంపెయిన్ కూడా కండక్ట్ చేయాలన్నారు.. ఇందుకు సంబంధించిన పాంప్లెట్లు కూడా రావడం జరిగిందని వాటిని సచివాలయం వారిగా పంపిణీ కూడా చేస్తున్నారని ప్రతి ఇంటికి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. అదే విధంగా వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ జిల్లా పరిషత్ సీఈఓ ను ఆదేశించారు......రోజు వారిగా ఎన్ని ఇళ్లకు ఇచ్చారనే వివరాలను కూడా ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు . టెలి కాన్ఫరెన్స్ లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి ఘన స్వాగతం

**కర్నూలు, ఏప్రిల్ 17(మనం న్యూస్):** ఉమ్మడి జిల్లాలో రెండు రోజులపాటు పర్యటన నిమిత్తం, పిన్నాపురం ప్రాజెక్ట్ సైట్, గ్రీన్ కో ప్రాజెక్టును పరిశీలించేందుకుగాను సాయంకాలం 6.10 గంటలకు కర్నూలు ఓర్వకల్లు ఎయిర్పోర్టుకు చేరుకున్న కేంద్ర కన్స్యూమర్స్ అఫైర్స్, ఫుడ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్, న్యూ, రెన్యువబుల్ ఎనర్జీ మంత్రి ప్రహ్లాద్ జోషి కి కర్నూలు, నంద్యాల పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి,పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పుష్ప గుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. కర్నూలు నగరంలోని మౌర్య ఇన్ హోటల్ చేరుకున్న కేంద్ర కన్స్యూమర్స్ అఫైర్స్, ఫుడ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్, న్యూ రెన్యువబుల్ ఎనర్జీ మంత్రిప్రహ్లాద్ జోషిని మర్యాదపూర్వకంగా కలిసి జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య పుష్పగుచ్చమం ను అందజేసి స్వాగతం పలికారు.



## కందుకూరి పురస్కార గ్రహీతలను సత్కరించిన మాజీ రాజ్యసభ సభ్యులు టీ జి వెంకటేష్



**కర్నూలు ఏప్రిల్ 17 మనం న్యూస్:** విజయవాడలో కందుకూరి విశిష్ట పురస్కారం అందుకున్న ఐదు మంది కళాకారులను మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ సత్కరించి అభినందించారు. ఈరోజు తన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉగాది పురస్కారాలు, కందుకూరి పురస్కారాలు టీజీవి కళాక్షేత్రానికి లభించడం సంతోషం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఐదు కందుకూరి విశిష్ట పురస్కారాలు టీజీవి కళాక్షేత్రానికి రావటం విశేషం అన్నారు. అవార్డులు సాధించడానికి తగిన ప్రోత్సాహం కళాక్షేత్రం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో టీ జీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ, కె.వి రమణ, పి రాజారత్నం తదితరులు పాల్గొన్నారు. పురస్కార గ్రహీతలు గాండ్ల లక్ష్మన్న, జీవి శ్రీనివాస్ రెడ్డి,ఎర్రమ పాండురంగయ్య, ఎమ్మార్ రాధిక వనారస మంజులను ఆయన అభినందించి చంద్రబాబు జన్మదిన వేడుకలలో వారికి విశేష సత్కారం చేస్తామన్నారు.

# భూభారతి చట్టంపై అవగాహన

- **జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**నంగునూరు, ఏప్రిల్ 17, (మనం న్యూస్) :** నంగునూరు మండల పరిధిలోని సిద్దన్నపేటలో గల బాలాజీ ఫంక్షన్ హాల్ లో గురువారం నాడు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) అబ్దుల్ హమీద్ ముఖ్య అతిథులుగా పాల్గొని భూ భారతి చట్టం గురించి వివరించారు. ఈ సందర్భంగా సదస్సులో భూభారతి చట్టం యొక్క ముఖ్యాంశాలు, ఆర్ఓఆర్లో తప్పుల సవరణ, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ మరియు మ్యుటేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, అప్పీల్ వ్యవస్థ, భూధార్ కార్డులు, ఈ చట్టం ఏ భూములకు వర్తిస్తుంది, ఇంటి స్థలాల హక్కుల రికార్డు వంటి అంశాలపై రైతులు, ప్రజా ప్రతినిధులకు విస్తృతంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, ప్రజా ప్రతినిధులు తమ సందేహాలను, సలహాలను విన్నవించగా, అధికారులు ఓపికతో సందేహాలను



నివృత్తి చేస్తూ, సలహాలను స్వీకరించారు. ఈ సదస్సు రైతులకు భూభారతి చట్టం గురించి సమగ్ర అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సదానందం, డిపిఓ దేవకిదేవి, వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## నగర పౌరుల అరచేతిలో నగరపాలక సేవలు

- **ప్రతి ఒక్కరూ పురసేవ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి**
- **నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ**



**కర్నూలు, ఏప్రిల్ 17(మనం న్యూస్):** నగర పౌరులు అరచేతిలో నగరపాలక సేవలు పొందవచ్చని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ గురు వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నగరాలు, పట్టణాల ప్రజల సౌకర్యార్థం, స్థానిక సమస్యలకు సులువుగా పరిష్కారం పొందేందుకు వీలుగా 'పురమిత్ర' యాప్ను రూపొందించిందని, నగరపాలకకు సంబంధించిన సమస్త సేవలను కార్యాలయానికి వెళ్ళాల్సిన అవసరం లేకుండా, సులువుగా 'పురమిత్ర'లోనే సకల సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, ఇళ్లలో చెత్త సేకరణ, ఇంటి పన్ను చెల్లింపు, భవన నిర్మాణ అనుమతులు, ఆక్రమణలు, ప్రజారోగ్యం, దోమలు, కుక్కల బెడద, రహదారులపై గుంతలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, కుళాయిల ఏర్పాటు, పేదరిక నిర్మూలన, వంటి 119 రకాల సేవలు పురసేవ యాప్లో అందుతాయని వెల్లడించారు. దీనిని ప్లే స్టోర్ లేదా యాప్ స్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. టైప్ చేసి లేదా లేదా వాయిస్ రూపంలోనూ పంపేందుకు అవకాశం ఉందని, సమస్యను ఫోటో తీస్తే ఆటోమెటిగ్గా ఏఐ ద్వారా సంబంధిత చిరునామా అధికారులకు వస్తుందని వెల్లడించారు. నగరంలో ఇప్పటికి 50 వేల మంది పౌరులు పురమిత్ర యాప్ను డౌన్లోడ్ చేసుకున్నారని, మిగిలిన పౌరులు సైతం డౌన్లోడ్ చేసుకోవాలని అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ సూచించారు.

## అపరిచితుల మాటలు నమ్మవద్దు

- **త్రీ టౌన్ ఎస్ఐ తిరుపతి**

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 17(మనం న్యూస్):** విద్యార్థినీ విద్యార్థులు, యువతులు అపరిచితులు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని సిద్దిపేట త్రీ టౌన్ ఎస్.ఐ. తిరుపతి సూచించారు. షీ టీమ్ విధులు, మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి గురువారం రోజున మిట్టపల్లి కేజీబివి పాఠశాల విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఎవరైనా అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట షీ టీమ్ నెంబర్ 87126 67434 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ స్పెషల్ ఆఫీసర్ ఆసియా, ఉపాధ్యా యులు, షీ టీమ్ బృందం ఏఎస్ఐ కిషన్, మహిళా కానిస్టెబుల్ మమత, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మార్కులతో కూడిన ప్రగతి కార్డులను 21వ తేదీ నాటికి అందించాలి


- **జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య,**

**కర్నూలు, ఏప్రిల్ 17(మనం న్యూస్):** జిల్లాలోని విద్యార్థులకు మార్కులతో కూడిన ప్రగతి కార్డులను 21వ తేదీ నాటికి అందించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం పాఠశాలల ముగింపుకు సంబంధించి ట్రీఫ్ఖ ద్వారా సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులకు మార్కులతో కూడిన ప్రగతి కార్డులను 21వ తేదీ నాటికి అందించి ఆన్లైన్ నమోదు పూర్తి చేయాలన్నారు.. పై తరగతులకు చేర్చే ప్రక్రియ పూర్తిచేసి సోమవారం నాడు కొత్త తరగతుల్లో కూర్చునే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. పాఠశాల ఆవశ్యకత, విద్యా ప్రమాణాల గురించి విద్యార్థులకు తెలియజేయాలని. ఈ ప్రక్రియ ఒకటి నుండి 10వ తరగతి వరకు అన్ని తరగతులవరకు జరిగేలా చూడాలని జేసీ ఆదేశించారు..జిల్లావ్యాప్తంగా 4,21,632 విద్యార్థులు పై తరగతులకు వెళ్తున్నందున వారందరికీ స్కూలు ప్రత్యేకతల ను తెలియ జేయాలన్నారు.. జిల్లా వ్యాప్తంగా 1886 అంగన్వాడి కేంద్రాల నుండి పూర్వ ప్రాథమిక విద్యను పూర్తిచేసుకుని ప్రాథమిక విద్యలోకి చేరుతున్నందున వారందరూ మన పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. రాబోయే మూడు రోజులు అనగా 21, 22, 23 తేదీలలో విద్యార్థులు కొత్త తరగతుల్లోకి మారేలా సంబంధిత అన్నీ స్థాయిలలోని విద్యాశాఖాధికారులు కృషి చేయాలన్నారు.. 21 నుండి అందరికీ డే వైస్ షెడ్యూల్ ఇచ్చి ఉన్నందున షెడ్యూల్ ప్రకారం కార్యాచరణలోకి వెళ్లాలన్నారు..పర్యవేక్షణ నిమిత్తం నియమించిన సెక్టోరియల్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ క్రియాశీలక కార్యాచరణ నిమిత్తం జిల్లా,డివిజన్, మండలస్థాయి మానిటరింగ్ కమిటీలు నియమించడం జరిగిందని, ఆయా కమిటీలు విస్తృతంగా పర్యటించి నూటికి నూరు శాతం ఇచ్చిన ఆదేశాలు అమలయ్యేలా, ఆచరణాత్మక కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శ్యామ్యూల్ పాల్ ,జిల్లా లోని కాన్సిట్యూటెన్సీ లెవెల్ ఆఫీసర్స్, మండల్ స్పెషల్.ఆఫీసర్స్ , సిడిపీఓలు, సీఈఓ, కర్నూలు, డిప్యూటీ డిఈఓలు, మండల విద్యాధికారులు క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



## స్వర్ణ పుష్ప అలంకరణలో మూల బృందావన దర్శనం

**మంత్రాలయం, ఏప్రిల్ 17(మనం న్యూస్) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో మూల బృందావనాన్నికి విశేష స్వర్ణ కవచాలు, పుష్పాలతో అలంకరించారు. గురువారం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో ముందుగా గ్రామ దేవత శ్రీ మంచాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్నికి విశేష పంచామృతాభిషేకం, ఫల పుష్పాభి షేకం, సుప్రభాత సేవ, తులసి అర్చన, ఉత్సవ రాయల పాద పూజ, కనక మహా పూజ, నిత్య నిర్మల్య అభిషేక పూజలు చేశారు. సంస్థాన పూజల్లో భాగంగా శ్రీ మూల రామ దేవతలకు విశేష అభిషేక పూజలు చేసి హారతి ఇచ్చారు. భక్తులు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని, శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ఉత్సవ మూర్తి శ్రీ ప్రహ్లాద రాయలను గజ, కొయ్య, వెండి, బంగారు, నవరత్న రథోత్సవాలపై ఉంచి మఠం ప్రాకారంలో అశేష భక్తుల నడుమ ఘనంగా ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తికి ఉయ్యాల సేవ చేసి మహా మంగళహారతి ఇచ్చారు. శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మంత్రాలయం చేరుకున్నారు.



# భూ భారతి చట్టం తో భూ సమస్యలకు పరిష్కారం

- **జడ్చర్ల శాసన సభ్యులు అనిరుధ్ రెడ్డి**

**మహబూబ్ నగర్, ఏప్రిల్ 17(మనం బ్యూరో):** రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన భూ భారతి చట్టం తో భూ సమస్యలకు పరిష్కారం కానున్నట్లు జడ్చర్ల శాసన సభ్యులు అనిరుధ్ రెడ్డి అన్నారు .భూభారతి చట్టం( భూమి హక్కుల రికార్డు చట్టం-2025 ) పై రైతులకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించి గురువారం నుండి ప్రారంభమైన అవగాహన కార్యక్రమంలో భాగంగా జడ్చర్ల మండల కేంద్రం చంద్ర గర్డెన్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి చట్టం పై అవగాహన సదస్సు జిల్లా లో జడ్చర్ల లో ప్రారంభం కావడం సంతోషకరం అన్నారు.పేద రైతుల కోసం భూ భారతి చట్టం వచ్చిందని,అర్ చట్టం తీసుకువచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి సి.ఎం.రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. రైతులు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఏ సమస్య అయినా భూ భారతి ద్వారా పరిష్కారం అవుతుందని తెలిపారు. రైతులకు మేలు జరిగేలా, ఎలాంటి భూ వివాదాలు లేని గ్రామాలను తీర్చిదిద్దేందుకు ఎన్నో రోజులు సమాలోచనలు చేసి మేధావులు, అధికారులు అందరితో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు.

గతంలో ధరణి ద్వారా భూ సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. తాను,తన తల్లి కొనుగోలు చేసిన భూములకు ధరణి ద్వారా ఎదురుకొన్న ఇబ్బందులను సమావేశంలో ఆయన వివరించారు.ధరణి ద్వారా తప్పుడు ఏ.జి..పి.లతో దొంగ రిజిస్ట్రేషన్ లు జరిగిన




ఉదంతాలు తెలిపారు..ధరణి లో ఉన్న లోపాలు సవరించి భూ సమస్యల పరిష్కారం కు ప్రభుత్వం భూ భారతి అర్. ఓ.అర్ చట్టం తీసుకు వచ్చిందని అన్నారు. ప్రతి రోజూ గ్రామాల్లో ప్రజల నుండి వచ్చే సమస్యల్లో 90 శాతం భూ సమస్యలు అని తెలిపారు. పేద రైతులకు భూ భారతి చట్టం ద్వారా న్యాయం జరుగుతుందని అన్నారు.రెవెన్యూ అధికారులు చిత్త శుద్ధితో భూ భారతి చట్టం ద్వారా పేద రైతుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ భూ భారతి చట్టం ను ఏప్రిల్ 14 న అంబేద్కర్ జయంతి సందర్భంగా అమలులోకి వచ్చిందని అన్నారు.

భూభారతి చట్టం పేద రైతులకు చేరేలా అవగాహన కల్పించాలని అన్నారు. అందరి అభిప్రాయాలు సేకరించి, చర్చించిన పిదప ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగిందని తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులలో ఎక్కువగా భూ సమస్యలతో వస్తున్నట్లు తెలిపారు. ధరణిలో తప్పొప్పుల సవరణకు రెవెన్యూ అధికారులకు ఎలాంటి అధికారాలు లేవని,సమస్యలు తీరాలంటే కోర్టులను ఆశ్రయించవలసి వచ్చేదని అన్నారు. సర్వే నెంబర్ లు మిస్ అవడం,తెల్ల కాగితం మీద రాసుకొని కొనుగోలు చేసిన భూములకు ఎటువంటి హక్కులు లేవని,ఇనాం భూములకు ఓ.అర్.సి.,38 ఈ సర్టిఫికెట్ మొదలగు మార్గాల ద్వారా భూమి హక్కులు సంక్రమించిన ప్పుడు ధరణి లో నమోదుకు ఎలాంటి నియమాలు లేవని తెలిపారు అన్ని భూ సమస్యలకు భూ భారతి పరిష్కారం చూపుతుందని అన్నారు.

ప్రతి వ్యక్తికి ఆధార్ కార్డు లాగా నే ప్రతి భూమికి భూదార్ కార్డ్ జారీ చేయడం జరుగుతుందని అన్నారు.భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు.తహశీల్దార్ దగ్గర పరిష్కారం కాకుంటే అర్.డి. ఓ కు,అర్.డి. ఓ దగ్గర కాకుంటే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని అన్నారు జిల్లా కలెక్టర్ ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలు ఉంటే భూమి ట్రిబ్యునల్ కురెండవ అప్పీల్ వెళ్ళ వచ్చని తెలిపారు రిజిస్ట్రేషన్,మ్యూటేశన్ చెయ్యడానికి ముందు భూముల సర్వే మ్యాప్ తయారీ చేయడం జరుగుతుందని తెలిపారు.భూ భారతి చట్టం ద్వారా రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. భూ భారతి చట్టం రూపకల్పనలో ప్రముఖ పాత్ర పోషించిన న్యాయ వాది భూమి సునీల్ మాట్లాడుతూ పది కాలాల పాటు నిలిచే చట్టం భూ భారతి అని పేర్కొన్నారు. ఏ గ్రామానికి వెళ్ళినా భూ సమస్యలు ఉన్నాయని,రాష్ట్రం లో 25 లక్షల మంది రైతులు ఏదో సమస్య ఎదుర్కొంటున్నారని తెలిపారు.భూ భారతి చట్టం లో భూమి రికార్డ్ లో లేకున్నా ,తప్పులు ఉన్నా, సెక్షన్ 4,సబ్ సెక్షన్ 5,6 కింద దరఖాస్తు పెట్టుకొంటే సమస్య పరిష్కరించడం జరుగుతుందని అన్నారు.జూన్ 2 నుండి ఆగస్టు 17 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించ నున్నట్లు తెలిపారు.రెవెన్యూ అధికారులు గ్రామాలకు వస్తారని తెలిపారు. గ్రామంలో నిర్ణీత రెండు పేజీల దరఖాస్తు పెట్టుకొంటే సమస్య ను పరిష్కరిస్తారని తెలిపారు.

3,4 నెలల్లో రిజిస్ట్రేషన్ వ్యవస్థ లో విప్లవాత్మక మార్పులు రానున్నట్లు తెలిపారు .6 వేల మంది లైసెన్స్డ్ సర్వేయర్ లను నియమించి మ్యాప్ తయారు చేసి రిజిస్ట్రేషన్ చేసి రాబోవు రోజుల్లో పట్టాదారు పాస్ పుస్తకంలో కూడా మ్యాప్ పొందుపరచడం జరుగుతుందని అన్నారు.దేశంలో ఏ చట్టం లో లేని విధంగా భూ భారతి చట్టం లో నియమాలు ఉన్నవని ఆయన తెలిపారు.30 లక్షల మంది రైతులకు ఈ చట్టం ద్వారా మేలు జరుగుతుందని అన్నారు. సమావేశం లో ఏర్పాటు చేసిన స్క్రీన్ ద్వారా భూ భారతి చట్టం ను ప్రదర్శించి అవగాహన కలిగించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు,నియోజకవర్గ ప్రత్యేక అధికారి,జడ్.పి.సి. ఈ . ఓ వెంకట రెడ్డి,ఆర్.డి. ఓ నవీన్,తహశీల్దార్ నర్సింగ రావు,తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ప్రబంధ వాఙ్మయము సాహిత్యాను శీలనం



**మహబూబ్ నగర్, ఏప్రిల్ 17 (మనం బ్యూరో):** ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ, అండ్ పీజీ అటానమస్ కళాశాల మహబూబ్ నగర్ ఆధ్వర్యంలో ప్రబంధ వాఙ్మయము సాహిత్యాను శీలనము ఒకరోజు జాతీయ సదస్సు లో భాగంగా ప్రత్యేక అతిథి శ్రీ ఆచార్య డిఎస్ఆర్ రాజాసింగ్ , ఆర్జెడి కళాశాల విద్య గౌరవ అతిథులు ,పాలమూరు విశ్వ విద్యాలయం జి.మధుసూదన్ రెడ్డి ప్రిన్సిపాల్ పీజీ కాలేజ్ మహబూబ్నగర్ , కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి. రాజేంద్రప్రసాద్ , డాక్టర్ వైస్ ప్రిన్సిపాల్ పద్మా అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ అమీనా ముంతాజ్ జహన్, డాక్టర్ పద్మవతి ఎంవిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల డాక్టర్ పద్మావతి , డాక్టర్ జి సుకన్య, ప్రధాన చార్యులు బి.ఆర్.ఆర్ జిడీసీ జడ్చర్ల ప్రధాన ఆచార్యులు , ఆత్మీయ అతిధులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి , ప్రముఖ సాహిత్య వేత జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు , కీలకోపన్యాసకులు ఆచార్య సంగనభట్ల నరసయ్య విశ్రాంత ప్రధాన చార్యులు, ప్రముఖ సాహితీవేతలు స్వాగత నృత్యం ప్రబంధ వాఙ్మయము సాహిత్యాను శీలనము ద్వారా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నేటి కాలంలో కవులు అంతరించిపోతున్న తరుణంలో ఈ కళాశాలలో ఒక్కరోజు జాతీయ సదస్సులో భాగంగా ప్రబంధ వాఙ్మయము సాహిత్యాను శీలనము జాతీయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ప్రబంధ వాఙ్మయం, వలన హాస్యము, చతురత, వర్ణన, శృంగారం, కథ, అనేక అంశాల ద్వారా ఆనాటి జీవన విధానం ఆనాటి స్థితి గతులు, ఆనాటి ఆర్థిక పరిస్థితులు , వారి ఆహాభావాలు ఏ విధంగా ఉన్నాయో ప్రిన్సిపాల్ తెలిపారు. కీలక ఉపన్యాసకులు సంగనభట్ల నరసయ్య మాట్లాడుతూ ప్రబంధాలు సంస్క ృతాలు సాంప్రదాయాలు, ఆచారాలు అనే సంస్క ృతి అనేది ఉత్తమమైన పద్ధతినే అనుసరించడమే సంస్క ృతి అని తెలియజేశారు. ఆత్మీయ అతిథి కసిరెడ్డి వెంకటరెడ్డి ప్రబంధాలు నాడు రేపు అనే అంశంపై సుదీర్ఘంగా మాట్లాడారు. ఇట్టి కార్యక్రమంలో జాతీయ సదస్సులో పత్ర సమర్పకులు ఆన్లైన్లో పారిజాతపరహరణం, శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాలద విశిష్టత గురించి వివరించారు. ముగింపు కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ డాక్టర్ కే. రాజ్ కుమార్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, . ఈ కార్యక్రమంలో తెలుగు విభాగ అధిపతి డాక్టర్ లక్ష్మీనరసింహారావు, ఫిజిక్స్ డిపార్ట్మెంట్ కేశవర్ధన్ , కామర్స్ డిపార్ట్మెంట్ మధుసూదన్ శర్మ, శ్రీకృష్ణుడు, లింగమయ్య, అధ్యాపక బృందం అధ్యాపకేతర బృందం విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్‌కు జాక్ పాట్..?

టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ జాక్ పాట్ కొట్టనున్నాడని తెలుస్తుంది. త్వరలో బీసీసీఐ ప్రకటించబోయే సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో చోటు దక్కించుకోనున్నాడని సమాచారం. అభిషేక్‌తో పాటు టీమిండియా యువ ఆటగాళ్లు నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కించుకోనున్నారని తెలుస్తుంది. పై నలుగురికి బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌లో గ్రేడ్-సి హోదా దక్కవచ్చు. ఈ నలుగురికి గ్రేడ్-సి దక్కితే అనేక వెసలుబాటులతో పాటు ఏడాదికి రూ. కోటి వార్షిక వేతనం లభిస్తుంది. బీసీసీఐ స్టాండర్డ్ పాలసీ ప్రకారం.. ఓ ఆటగాడు నిర్దిష్ట వ్యవధిలో (కాంట్రాక్ట్ ప్రకటించే ముందు ఏడాదిలో అక్టోబర్ నుండి సెప్టెంబర్ వరకు) కనీసం మూడు టెస్టులు లేదా ఎనిమిది వన్డేలు లేదా పది టీ20లు ఆడి ఉంటే సెంట్రల్ కాంట్రాక్ట్ గ్రేడ్-సిలో చేర్చబడతారు. అభిషేక్ నిర్దిష్ట వ్యవధిలో టీమిండియా తరఫున 12 టీ20లు ఆడాడు. మొత్తంగా అతను భారత్ తరఫున 17 టీ20లు ఆడాడు.

నితీశ్ విషయానికొస్తే.. 21 ఏళ్ల ఈ ఆంధ్ర ఆల్ రౌండర్ భారత్ తరఫున ఐదు టెస్టులు, నాలుగు టీ20లు ఆడాడు. నిర్దిష్ట వ్యవధిలోనే నితీశ్ ఈ మ్యాచ్ లను ఆడాడు. నితీశ్ గతేడాది చివర్లో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఐదు టెస్ట్ ల్లో పాల్గొన్నాడు. ఆ సిరీస్ లో సత్తా చాటడంతోనే నితీశ్ రాత్రికిరాత్రి హీరో అయిపోయాడు. హర్షిత్ రాణా విషయానికొస్తే.. ఇతడు సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కించుకునేందుకు ఆడాల్సిన మ్యాచ్ లను ఆడనప్పటికీ, బీసీసీఐ ఇతని విషయంలో ఉదారంగా వ్యవహరించే అవకాశం ఉందని తెలుస్తుంది. రాణా టీమిండియా తరఫున కేవలం రెండు టెస్టులు, ఐదు వన్డేలు, ఓ టీ20 మాత్రమే ఆడాడు. రాణా.. మూడు ఫార్మాట్లలో దేనిలోనూ విడిగా ప్రమాణాలను నెరవేర్చలేదు. కానీ అతనికి బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. వరుణ్ చక్రవర్తి విషయానికొస్తే.. ఇతడు భారత్ తరఫున నాలుగు వన్డేలు, 18 టీ20లు ఆడి బీసీసీఐ కాంట్రాక్ట్ పొందేందుకు అర్హుడిగా ఉన్నాడు.

పై నలుగురితో సహా బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కించుకునే వారిలో మరో పెద్ద పేరు ఉండనుంది. ఇటీవల ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీలో రఫ్ఫాడించిన శ్రేయస్ అయ్యర్ బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలోకి తిరిగి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. శ్రేయస్కు ఏ-గ్రేడ్ దక్కే అవకాశం ఉంది. మరో రెండు రోజుల్లో బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ ఆటగాళ్ల జాబితాలను ప్రకటించవచ్చు.

**ప్రస్తుతం బీసీసీఐ కాంట్రాక్ట్ లు కలిగిన ఆటగాళ్లు..**

గ్రేడ్-ఏ ప్లస్: రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా.

గ్రేడ్-ఏ: అశ్విన్, మొహమ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్, కేఎల్ రాహుల్, శుభ్ మన్ గిల్, హార్దిక్ పాండ్యా.

గ్రేడ్-బి: సూర్య కుమార్ యాదవ్, రిషబ్ పంత్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, యశస్వి జైస్వాల్.

గ్రేడ్-సి: రింకూ సింగ్, తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, శార్దూల్ ఠాకూర్, శివమ్ దూబే, రవి బిష్ణోయ్, జితేష్ శర్మ, వాషింగ్టన్ సుందర్, ముఖేష్ కుమార్, సంజు శాంసన్, అర్ష్‌దీప్ సింగ్, కేఎస్ భరత్, ప్రసిద్ధ్ కృష్ణ, అవేష్ ఖాన్, రజత్ పాటీదార్.


అభిషేక్ శర్మ,

# IPL-2025



# సొంతగడ్డపై సత్తాచాటిన ముంబయి

ఐపీఎల్ 18లో సన్స్ రైజర్స్ హైదరాబాద్ ఐదో ఓటమి చవిచూసింది. వాంఖడే వేదికగా జరిగిన మ్యాచ్ లో ఎస్ఆర్హెచ్ పై ముంబయి ఇండియన్స్ 4 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (40), క్లాసెన్ (37) రాణించారు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన ముంబయి 18.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆ జట్టులో ర్యాన్ రికెల్టన్ (31), విల్ జాక్స్ (36), రోహిత్ శర్మ (26), సుర్యకుమార్ యాదవ్ (26), హార్దిక్ పాండ్య (21) రాణించారు. ఎస్ఆర్హెచ్ బౌలర్లలో కమిన్స్ 2, ఎషాన్ మలింగ 2, హర్షల్ పటేల్ ఒక వికెట్ తీశారు. ముంబయికి ఇది వరుసగా రెండో విజయం.



# 'ఉమ్మి' గేమ్ ఛేంజరా? నేనైతే వాడను

రాజస్థాన్ పై 'సూపర్' విక్టరీ సాధించడంలో ఢిల్లీ పేసర్ మిచెల్ స్టార్క్ కీలక పాత్ర పోషించాడు. తొలుత నాలుగు ఓవర్ల కోటాలో వికెట్ తీసి 36 పరుగులు ఇచ్చాడు. ఆఖరి ఓవర్ లో రాజస్థాన్ విజయానికి కేవలం 9 పరుగులే అవసరం. స్టార్క్ అద్భుతంగా బంతులేసి ఒక్క బౌండరీ ఇవ్వలేదు. ఈ ఓవర్ లో 8 పరుగులే రావడంతో మ్యాచ్ 'సూపర్' ఓవర్ కు చేరింది. అక్కడా సత్తా చాటిన స్టార్క్ 10 పరుగులే ఇచ్చాడు. దీంతో ఢిల్లీ నాలుగు బంతుల్లోనే విజయం సాధించింది. ఈ క్రమంలో 'ఉమ్మి' కీలక పాత్ర పోషించిందనే వాదనను మిచెల్ స్టార్క్ కొట్టిపడేశాడు. తాను అసలు సెలీవాను (లాలాజలం) వాడేది ఉండదని.. చెమటను ఎక్కువగా బంతికి పూసేందుకు ప్రయత్నిస్తానని వెల్లడించాడు. కరోనా కారణంగా ఐదేళ్ల కిందట బీసీసీఐ ఐపీఎల్ లో నిషేధం విధించింది. ఇప్పుడు మళ్లీ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

''నేను ఉమ్మి వాడను. దీనివల్ల ఏదో ప్రయోజనం ఉంటుందని అనుకోవడం లేదు. అసలు ఉమ్మికి, చెమటకు పెద్ద తేడా ఏముండదు. అది ఎర్ర బంతిపై ప్రభావం చూపిస్తుందేమో కానీ.. తెల్ల బంతిపై కాదు. కీలకమైన మ్యాచ్ లో విజయం సాధించడం ఆనందంగా ఉంది. పక్కా ప్రణాళికతోనే బరిలోకి దిగా. నేను ఎలా అమలుచేయాలని అనుకుంటానో అదే చేస్తా. ఇప్పటివరకు నేను ఏం చేశాననేది అందరికీ తెలుసు. సూపర్ ఓవర్ కు వెళ్లడం భలేగా ఉంది. అయితే, నో బాల్ వేసినా వెంటనే పుంజుకొన్నాం. రనౌట్ల రూపంలో రెండు వికెట్లు దక్కాయి. మా బ్యాటర్లు అలవోకగా బాదేశారు'' అని స్టార్క్ తెలిపాడు.



# డబ్బులు అవసరం అంటే డైరెక్ట్‌గా అడుగుతా

టాలీవుడ్ నటి, మోహన్ బాబు కూతురు మంచు లక్ష్మీ సోషల్ మీడియా ఖాతా హ్యాకింగ్ గురైంది. ఆమె ఇన్ స్టాగ్రామ్ స్టోరీస్ లో పోస్ట్ వాటిని ఎవరూ నమ్మవద్దని అభిమానులను, సన్నిహితులను కోరింది. తనకు డబ్బులు అవసరమైతే డైరెక్ట్ గా అడుగుతానని తెలిపింది. సోషల్ మీడియాలో ఎవరినీ నేను డబ్బులు అడగనని ట్వీట్ చేసింది. ఇలాంటి వాటి పట్ల దయచేసి అందరూ జాగ్రత్తగా ఉండాలని కోరింది. ఈ విషయాన్ని ట్విటర్ ద్వారా వెల్లడించింది. కాగా.. మంచు లక్ష్మీ ఇన్ స్టాగ్రామ్ స్టోరీస్ లో బిట్కాయిన్స్, క్రిప్టోకరెన్సీకి సంబంధించిన పోస్టులు ప్రత్యక్షమయ్యాయి. దీంతో అప్రమత్తమైన మంచు లక్ష్మీ వెంటనే ట్విటర్ ద్వారా అభిమానులను, సన్నిహితులను అలర్ట్ చేస్తూ ట్వీట్ చేసింది. చివరికీ నా మొబైల్ నంబర్ కూడా హ్యాకర్స్ గుర్తించారని ట్విటర్ ద్వారా వెల్లడించింది. ఆఫ్రికా దేశం నైజీరియాకు చెందిన సైబర్ కేటుగాళ్లు ఈ హ్యాకింగ్ కు పాల్పడినట్లు తెలుస్తోంది.కాగా.. మంచు లక్ష్మీ ఇటీవలే హైదరాబాద్ లో గ్రాండ్ ఫ్యాషన్ షో నిర్వహించింది. టీచ్ ఫర్ ఛేంజ్ పేరిట నిర్వహించిన ఈ ఈవెంట్ లో పలువురు టాలీవుడ్ సినీతారలు హాజరైన సందడి చేశారు. ఆమె తమ్ముడు మంచు మనోజ్ సైతం ఈవెంట్ కు సర్ ప్రైజ్ ఇచ్చారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరలైన సంగతి తెలిసిందే. ఇక సినిమాల విషయానికొస్తే మంచు లక్ష్మీ చివరిసారిగా మలయాళ యాక్షన్ థ్రిల్లర్ మాన్ స్టర్ లో కనిపించింది. ఇందులో మోహన్ లాల్, హనీ రోజ్, జానీ ఆంటోనీ, జగపతి బాబు కూడా అతిథి పాత్రలో కనిపించారు. ప్రస్తుతం ఆమె మెడికల్ సైకలాజికల్ థ్రిల్లర్ దక్ష - ది డెడ్లీ కాన్స్పిరసీలో కనిపించనుంది. వంశీ కృష్ణ మళ్ల దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రంలో సముద్రఖని, విశ్వంత్, చిత్ర శుక్లా, మహేశ్, వీరేన్ తంబిదొరై కూడా నటించారు.





# స్పిరిట్ పూర్తి చేశాకే?

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న రెండు సినిమాలు ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్నాయి. ఒకటి 'ది రాజాసాబ్' కాగా, మరొకటి హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా. మరో సినిమా 'స్పిరిట్'తోపాటు, ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందనున్న సినిమా కూడా ప్రారంభానికి సిద్ధం అవుతున్నాయి. ఆయా సినిమాల చిత్రీకరణలు, నిర్మాణానంతర పనుల్లో ఆలస్యం కారణంగా... కథానాయకులు, దర్శకుల ప్రాధాన్యాలు మారుతుంటాయి. ఈ క్రమంలో అనూహ్యంగా కొత్త ప్రాజెక్టులు తెరపైకొస్తుంటాయి. అలా టాలీవుడ్ లో ప్రస్తుతం పలు కలయికలు ప్రచారంలో ఉన్నాయి. 'స్పిరిట్' ఆలస్యం అవుతుండడంతో కథానాయకుడు ప్రభాస్ కి సంబంధించి, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా చేయనున్న సినిమాల గురించి పలు ఊహాగానాలు ప్రచారంలోకి వస్తున్నాయి. 'స్పిరిట్' స్థానంలో వీళ్లిద్దరూ వేరే ప్రాజెక్టుల్ని పట్టాలెక్కిస్తారనేది వాటి సారాంశం. అయితే ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా ఇద్దరూ కూడా 'స్పిరిట్' పూర్తి చేశాకే ఇతర ప్రాజెక్టులపైన దృష్టిపెట్టనున్నట్టు తెలిసింది. ఇటీవలే ఈ సినిమా కోసం లొకేషన్ల ఎంపికపై కసరత్తులు కూడా పూర్తయ్యాయి. త్వరలోనే ఈ సినిమా పట్టాలెక్కనుందని తెలిసింది. ఇందులో ప్రభాస్ పోలీస్ అధికారిగా నటించనున్నారు.



# అలా చెప్పడం నాకు నచ్చదు తమన్నా

'ఓదెల2'లో శివ శక్తిగా నటించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు నటి తమన్నా. అశోక్ తేజ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈసందర్భంగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ 'మిల్కీ బ్యూటీ' ట్యాగ్ పై మరోసారి స్పందించారు. ''నేను ఎప్పుడూ ఒకేతరహా పాత్రలకు పరిమితం కావాలని అనుకోవడం లేదు. అందంగా ఉన్నాను కాబట్టి నాకు అవకాశాలు వస్తున్నాయి అని చెప్పడం నాకు నచ్చదు. అలా చెబితే వింతగా ఉంటుంది. మేము సినీ రంగంలో ఉంటున్నాం. ఈ పరిశ్రమలో ఉన్నవాళ్లకు అందం మీద శ్రద్ధ ఉండాలి.. కానీ, కథను ఎంచుకునేటప్పుడు పాత్ర గ్లామరస్ గా ఉందా, లేదా అనేదానితో పాటు ఎన్నో విషయాలు చూసి ఎంపిక చేసుకుంటాం. 'మిల్కీ బ్యూటీ' అనే ట్యాగ్ నాకు అభిమానులు ఇచ్చారు. క్రమంగా అది వాడుకలోకి వచ్చింది. మీడియా దాన్ని మరింత ప్రచారం చేసింది. ఈ ట్యాగ్ నా సినిమాల ఎంపికలపై ప్రభావం చూపలేదు'' అని చెప్పారు. ఇటీవల కూడా తమన్నా దీనిపై మాట్లాడిన విషయం తెలిసిందే. అలా పిలవడం వల్ల తనకేం ఇబ్బందిగా లేదని.. అయితే తన అందం వల్ల కాకుండా పాత్రలతో నటనా సామర్థ్యాన్ని, వైవిధ్యాన్ని చూపించడం తన లక్ష్యమని చెప్పారు. తన పనితనాన్ని చూడాలని కోరారు.

# క్షమాపణలు చెప్పిన నజ్రియ్యా

గతేడాది చివర్లో 'సూక్ష్మ దర్శిని'తో ప్రేక్షకులను పలకరించారు నటి నజ్రియా. దీని షూటింగ్ పూర్తయిన నాటినుంచి ఆమె సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉన్నారు. దీంతో రకరకాల కామెంట్స్ మొదలయ్యాయి. తాజాగా నజ్రియా ఒక ఎమోషనల్ నోట్ విడుదల చేశారు. తాను మానసికంగా ఇబ్బందులు పడుతున్నానని, త్వరలోనే కోలుకుంటానని చెప్పారు. తనను సంప్రదించాలనుకున్న వారికి అందుబాటులో లేనందుకు క్షమించమని కోరుతూ నోట్ విడుదల చేశారు. ''నేను కొంతకాలంగా అందరికీ దూరంగా ఉంటున్నాను. కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల సోషల్ మీడియాలో యాక్టివ్ గా లేను. నా 30వ పుట్టినరోజు, నూతన సంవత్సర వేడుకలు, నా చిత్రం సక్సెస్ మీట్ లు.. ఇలా దేనికీ నేను హాజరుకాలేదు. ఎన్నో ముఖ్యమైన క్షణాలను మిస్ అయ్యాను. నా గురించి వివరాలు తెలుసుకోవడం కోసం ప్రయత్నించిన అందరికీ ధన్యవాదాలు. వాళ్ల ఫోన్ లకు నేను సమాధానం ఇవ్వలేదు. నాకు వారి సినిమాల్లో పాత్రలు ఇవ్వడం కోసం ఎంతోమంది ఫోన్ లు చేశారు. వారి ఫోన్లు నేను తీయలేదు. ఈ విషయంలో అందరినీ క్షమించమని కోరుతున్నాను. ఇది నాకు చాలా కఠినమైన సమయం. నేను త్వరలోనే కోలుకుని మీ ముందుకువస్తాను'' అని చెప్పారు. తాజాగా తాను ఉత్తమ నటిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డును అందుకున్నట్లు చెప్పారు. ఇక ఈ పోస్ట్ ను సమంత లైక్ చేశారు. రాజా రాణి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు నజ్రియా. తర్వాత ఫహద్ ఫాజిల్ ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొన్ని రోజులుగా నజ్రియా అందరికీ దూరంగా ఉండడంతో వీరిద్దరూ విడిపోతున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజాగా ఆమె పోస్ట్ పై నజ్రియా నజీం ఫహద్ అని రాయడంతో వీటికి చెక్ పడింది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.